

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 25-02-2026 | సంపుటి - 26 | సంచిక -277 | రూ : 4 | పేజీలు: 8

## కేరళ పేరు కేరళంగా మార్పు

- ఎల్డీఎఫ్ సర్కార్ తీర్మానానికి కేంద్రక్యాబినెట్ ఆమోదం
- పవర్‌గ్రిడ్‌కు ఈక్విటీ పెట్టుబడి పరిమితి పెంపు
- రూ.12,236 కోట్లతో రైల్, మెట్రో, ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టులకూ గ్రీన్‌సిగల్

2లో






## ఆపరేషన్ ఆక్టోపస్!

- దేశవ్యాప్తంగా గాలింపు, సైబర్ క్రైమ్ నెట్‌వర్క్ ఛేదింపు
- 16 రాష్ట్రాల్లో 104 మంది నిందితులను అరెస్ట్ చేసిన హైదరాబాద్ సిటీ పోలీసులు
- అరెస్టయిన వారిలో మ్యూల్ అకౌంట్ హోల్డర్లు, అకౌంట్ సరఫరాదారులు, బ్యాంక్ అధికారులు

2లో

# ఆ నలుగురూ వచ్చేశారు

- దేవ్‌జీ సహా మావోయిస్టు అగ్రనేతల లొంగుబాటు
- డీజీపీ సమక్షంలో.. జనజీవన స్రవంతిలోకి..
- మావోయిస్టు పార్టీ చరిత్రలో కీలక పరిణామం
- ఇక పొలిట్‌బ్యూరోలో మిగిలింది ఒక్కరే..
- లొంగిపోయిన నలుగురిదీఆర్ఎస్‌యూ నేపథ్యమే..

హైదరాబాద్: మావోయిస్టు పార్టీ చరిత్రలో అత్యంత కీలక లొంగుబాటు.. మునుపెన్నడూ లేని రీతిలో ఒకేసారి నలుగురు అగ్రనేతలు జనజీవన స్రవంతిలో కలిశారు. పార్టీ అత్యున్నత నిర్ణాయక కమిటీ అయిన పొలిట్ బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ ఎలియాస్ తరువాయి 2లో



# నాతో ఆటలాడొద్దు



- భాగస్వామ్యపక్షాలకు ట్రంప్ బెదిరింపులు...
- భారత్‌పైనే గురి
- వాణిజ్య చర్చలు వాయిదా పడడమే కారణం
- ప్రపంచ మార్కెట్లలో ఉద్రికత్తలు


న్యూఢిల్లీ : వాణిజ్య భాగస్వామ్య దేశాలపై తాను విధించిన సుంకాలను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో కంగు తిన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా ఆయా దేశాలకు హెచ్చరిక జారీ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపించి వాణిజ్య హామీల నుంచి వెనక్కి తగ్గితే ఊరు కునేది లేదని అంటూ తనతో ఆటలా డాలని చూడవద్దని, అలా చేస్తే భారీగా సుంకాలు తరువాయి 2లో

## 'పది' పరీక్షా కేంద్రాల వద్ద క్లోక్‌రూమ్‌లు

- వివాదాస్పద 'ఇంటర్' కేంద్రాలపై నిఘా
- కలెక్టర్లతో సీఎస్ రామకృష్ణారావు సమీక్ష
- నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

హైదరాబాద్: రాష్ట్రంలో తొలిసారిగా పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో క్లోక్‌రూమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులు తెచ్చుకున్న బ్యాగ్‌లను అక్కడ ఇచ్చి.. పరీక్ష తర్వాత తీసుకెళ్లొచ్చు. ఈ నెల 25వ తేదీ నుంచి ఇంటర్, మార్చి 14 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. తరువాయి 2లో





## ముంచుకొస్తోంది ఏఐ సునామీ

- సమాజమే సిద్ధంగా లేదు
- ఉద్యోగాలు కోల్పోయేలా చేయం
- ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్


కృత్రిమ మేధ (ఏఐ) ఒక సునామీలా ప్రపంచం మీదికి దూసుకొస్తోందని, కానీ, దానిని ఎదుర్కొనేందుకు సమాజం ఇంకా సిద్ధం కాలేదని ఆంథ్రోపిక్ సీఈఓ డారియో ఆమోడెయ్ పేర్కొన్నారు. ఆన్‌లైన్ బ్రోకరేజీ ప్లాట్‌ఫామ్ జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఏఐ భవిష్యత్తు, భారత ఐటీ రంగం, స్టార్టప్‌లు, కొత్త నైపుణ్యాలు, బయోటెక్నాలజీ వంటి తరువాయి 2లో

## దోషులుగా ఎవరున్నా శిక్ష పడాల్సిందే



- నాటి తితిదే పాలకమండలిదే బాధ్యత
- వారిని వెనకేసుకొస్తే గత ప్రభుత్వ ముఖ్యుడూ బాధ్యుడే
- దేవుడి సొమ్ము దోచేసినవారి తరాలే లేచిపోతాయ్
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

2లో



## విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు హైకోర్టు ప్రశంస

- విద్యార్థినులను ఎలుకలు కొరికిన వ్యవహారంపై వెంటనే స్పందించారని కితాబు
- మంత్రి ఇలా పనిచేస్తుంటే కొందరి నిర్లక్ష్యం ప్రభుత్వానికి, మంత్రికి చెడ్డపేరు తెస్తున్నారని వ్యాఖ్యలు
- సర్వశిక్షాభియాన్ పీడీ శ్రీనివాసరావుపై మండిపాటు



2లో

# శ్రీవారి ప్రతిష్ఠ దెబ్బతీసే కుట్ర

- కల్తీ నెయ్యి సహా మరెన్నో దుర్మార్గాలు
- రాజశేఖరరెడ్డి హయాంలోనే కుట్ర మొదలు
- జగన్ హయాంలో మరింత అరాచకం
- వారు తప్పుచేసి మమ్మల్ని క్షమాపణ చెప్పాలంటున్నారు
- తితిదేలో ప్రక్షాళన చేపట్టాం
- భక్తుల సేవకే పెద్దపీట
- శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి: వైకాపా ఐదేళ్ల పాలనలో తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి కృత్రిమ నెయ్యి లాంటి పదార్థాన్ని ఉపయోగించి వేంకటేశ్వరస్వామి పవిత్రతనే దెబ్బతీశారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో జంతుకొవ్వు కలిసిందని న్యాయస్థానంలో సిట్ దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్ 35వ పేజీలో స్పష్టంగా ఉందని వివరించారు. 'నెయ్యే కాని నెయ్యి వినియోగించడం అనేది ఒక అంశమే. దీని వెనుక శ్రీవారి ప్రతిష్ఠను దెబ్బతీయాలనే పెద్ద కుట్రకోణమే ఉంది. రాజశేఖరరెడ్డి హయాం నుంచే ఇది మొదలైంది. వైకాపా పాలనలో తరువాయి 2లో

# కేరళ పేరు కేరళంగా మార్పు

2024 జూన్ 24న కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అసెంబ్లీలో కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ ప్రతిపాదించిన తీర్మానానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని కేంద్రమంత్రి అశ్వనీవైష్ణవ్ తెలిపారు. రాజ్యాంగంలోని మూడో అధికరణ ప్రకారం ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చిన అన్ని భాషల్లో 'కేరళం'గా సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్టు స్పష్టం చేశారు. 'పూర్వం నుంచే మలయాళంలో 'కేరళం' అని పిలుస్తారని, స్వాతంత్ర పోరాట సమయం నుంచి మలయాళం మాట్లాడే వర్గాల కోసం ఐక్య కేరళను ఏర్పాటు చేయాలనే డిమాండ్ బలంగా ఉద్భవించిందని, 'రాష్ట్రం అసలు పేరు కేరళం. కానీ బ్రిటిషర్లు తమ సౌకర్యం కోసం కేరళగా మార్చారని, తిరిగి పేరు మార్పును కోరుతున్నట్టు వచ్చిన ప్రతిపాదనను ఆ రాష్ట్ర సంస్కృతికి అనుగుణంగా సరిదిద్దుతున్నాం' అని కేంద్ర మంత్రి వెల్లడించారు. ఈ బిల్లును రాష్ట్ర అసెంబ్లీ ఆమోదానికి పంపుతామని, అసెంబ్లీ ఆమోదం అనంతరం బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడతామని చెప్పారు. కేరళ రాష్ట్ర శాసనసభ అభిప్రాయాలను స్వీకరించిన తరువాత, కేంద్ర ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని, ఈ పేరు మార్పు బిల్లు 2026ను పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి రాష్ట్రపతి సిఫారసు చేస్తారని వివరించారు. మలయాళీ రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తాజా నిర్ణయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

*** పవర్‌గ్రిడ్‌కు ఈక్విటీ పెట్టుబడి పరిమితి పెంపు**

మహారత్న సీపీఎస్ఈలకు అధికారాల అప్పగింతపై ఉన్న మార్గదర్శకాల నుంచి పవర్ గ్రిడ్‌కు ఈక్విటీ పెట్టుబడి పరిమితిని రూ.5000 కోట్ల నుంచి రూ.7500 కోట్లకు పెంచేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంగళవారం నాడిక్కడ నూతన పీఎంఓ బిల్డింగ్ సేవా తీర్థ్‌లో ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. మహారత్న సీపీఎస్ఈలకు వర్తించే అధికారాల అప్పగింతపై పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ డిపార్ట్‌మెంట్ (డీపీఈ) 2010 ఫిబ్రవరి 4 నాటి మార్గదర్శకాల ప్రకారం పవర్ గ్రిడ్‌కు మెరుగైన అధికారాలు కల్పిస్తూ కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపారు. దీంతో కంపెనీ నికర విలువలో 15 శాతంగా ఉన్న ప్రస్తుత పరిమితిని నిలుపుకుంటూనే పవర్ గ్రిడ్ కోసం అనుమతించదగిన ఈక్విటీ పెట్టుబడి పరిమితిని ప్రతి అనుబంధ సంస్థకు రూ.7,500 కోట్లకు పెంచడానికి వీలు కల్పిస్తుందన్నారు. ఈ నిర్ణయం 500 గిగావాట్ల లక్ష్యాన్ని సాధించడం లోనూ సహాయపడుతుందన్నారు. పవర్ గ్రిడ్ ఇప్పుడు అల్ట్రా హై వోల్టేజ్ ఆల్టర్నేటింగ్ కరెంట్ (యూహెచ్‌వీఏసీ), హై వోల్టేజ్ డైరెక్ట్ కరెంట్ (హెచ్ వీడీసీ) ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ల వంటి క్యాపిటల్ ఇంటెన్సివ్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుల బిడ్‌లలో పాల్గొనడానికి వీలుంటుందని తెలిపారు. 202627 సీజన్‌కు గాను ముడి జనపనార (టీడీ3 గ్రేడ్) కనీస మద్దతు ధరను క్వింటాలుకు రూ. 5,925గా నిర్ణయిస్తూ కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది.

# 'పది' పరీక్షా కేంద్రాల వద్ద క్లోక్‌రూమ్‌లు

హైదరాబాద్: రాష్ట్రంలో తొలిసారిగా పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో క్లోక్‌రూమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులు తెచ్చుకున్న బ్యాగ్‌లను అక్కడ ఇచ్చి.. పరీక్ష తర్వాత తీసుకెళ్లొచ్చు. ఈ నెల 25వ తేదీ నుంచి ఇంటర్, మార్చి 14 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలు జరగకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. గతంలోని వివాదాస్పద పరీక్షా కేంద్రాలపై మరింత నిఘా పెట్టాలన్నారు. ఏ ఒక్క విద్యార్థి నేలపై కూర్చొని పరీక్ష రాయకూడదన్నారు. పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యాశాఖేతర అధికారులతో సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ చీఫ్ సూపరింటెండెంట్లకు మాత్రమే ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ఉపయోగించడానికి సెల్‌ఫోన్లను అనుమతిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ పీవీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

**మార్చి 3 నుంచి ఇంటర్ మూల్యాంకనం**

ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం మార్చి 3వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఆ రోజు నుంచి సంస్కృతం మూల్యాంకనం మొదలవుతుంది. ఆ తర్వాత మూడు విడతల్లో మిగిలిన సబ్జెక్టుల పేపర్లను దిద్దే ప్రక్రియ కొనసాగుతుంది.

**2,676 పరీక్షా కేంద్రాలు**

రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలకు 2,676 కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అందులో 1,582 ప్రభుత్వ, 1,094 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఈసారి పరీక్షలకు 5,17,727 మంది రెగ్యులర్ (తాజా) విద్యార్థులు, మరో 10,512 మంది ఒకసారి తప్పిన వారు హాజరవుతారు. రాష్ట్రవ్యాప్తంగా 11,674 పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాయబోతున్నారు. అందులో ప్రభుత్వ విద్యాసంస్థలు 6,386, ప్రైవేట్ పాఠశాలలు 5,288 ఉన్నాయి.

# దోషులుగా ఎవరున్నా శిక్ష పడాల్సిందే

అమరావతి : గత ప్రభుత్వంలో తిరుమల లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి వాడారని అన్ని నివేదికల్లో తేలినా, అందుకు బాధ్యులను గత ప్రభుత్వ ముఖ్యుడు ఎందుకు వెనకేసుకొస్తున్నారో అర్థం కావట్లేదని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. భగవంతుడి సొమ్ముతో ఆడుకున్నా, ఆ సొమ్ము దోచుకున్నా, వారి తరాలు కూడా లేచిపోతాయని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఇప్పటికైనా కల్తీని ఒప్పుకోవాలని, అలాకాకుండా దిల్లీ వెళ్లి కోర్టుల్లో కేసులు వేసేకొద్దీ మీ పాపం పెరిగి నాశనం త్వరగా వస్తుందే తప్ప, తగ్గదని వ్యాఖ్యానించారు. శాసనసభలో మంగళవారం కల్తీనెయ్యిపై లఘుచర్చలో పవన్‌కల్యాణ్ మాట్లాడారు. "గత ప్రభుత్వ హయాంలో తితిదేలో 68 లక్షల కేజీల కల్తీనెయ్యి వాడారు. అందులో పందికొవ్వు ఉందని ఎన్‌డీడీబీ నివేదికలో వచ్చింది. సీబీఐ సిట్ కూడా రసాయనాలు, పామాయిల్‌తో నెయ్యి లేకుండా నెయ్యి తయారుచేశారని పేర్కొంది. అలాంటప్పుడు ఆ ముఖ్యనేత.. 'నాకు సంబంధం లేదు, తితిదే బోర్డు అంతా చేసింది. దానిపై కమిటీ వేసి, నిష్పాక్షికంగా విచారణ జరిపి, శిక్షపడేలా చేయండి' అని సింపుల్‌గా తేల్చేయవచ్చు. కానీ సిట్ నివేదిక వచ్చాక కూడా కల్తీ లేదంటున్నార'ని మండిపడ్డారు. దీనికి నాటి తితిదే పాలకమండలితో పాటు గత ప్రభుత్వాన్ని నడిపిన వ్యక్తి కూడా బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. దోషులుగా ఎవరున్నా శిక్ష పడాల్సిందేనని స్పష్టంచేశారు. పవన్‌కల్యాణ్ ఇంకా ఏమన్నారంటే..

# ఆపరేషన్ ఆక్టోపస్!

హైదరాబాద్: సైబర్ నేరగాళ్ల ఆట కట్టించేందుకు నగర సైబర్‌క్రైమ్ పోలీసులు పాన్‌ఇండియా స్థాయిలో 'ఆపరేషన్ ఆక్టోపస్' నిర్వహించారు. 16 రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. పెట్టుబడులు, డిజిటల్ అరెస్ట్‌లు, ట్రేడింగ్ పేరిట రూ.కోట్లు కొల్లగొట్టడంలో సహకరించిన 104 మందిని అరెస్ట్ చేసినట్టు నగర కొత్వాల్ వీసీ సజ్జనర్ మంగళవారం తెలిపారు. పక్కావ్యూహంతో..: వందల కిలోమీటర్ల దూరంలో కూర్చొని అక్రమాలకు పాల్పడుతున్న వారి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు సీపీ సజ్జనర్ ఆపరేషన్ ఆక్టోపస్‌కు రూపకల్పన చేశారు. పోలీసు అధికారులు, సిబ్బందితో 32 బృందాలు ఏర్పాటు చేశారు. బ్యాంకు ఖాతాలు, సెల్‌ఫోన్ నంబర్ల ఆధారంగా నిందితుల ఆచూకీ కనిపెట్టారు. మహారాష్ట్ర, దిల్లీ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర 16 రాష్ట్రాల్లోని సైబర్ నేరాల హాట్‌స్పాట్లపై దాడులు నిర్వహించారు. 10 రోజుల దాడుల్లో 104 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో 86 మంది మ్యూల్ ఖాతాదారులు, 17 మంది మోసగాళ్లకు అవసరమైన వస్తువులు, సమాచారం చేరవేసేవారు, బంధన్ బ్యాంక్ రిలేషన్‌షిప్ మేనేజర్ ఒకరు ఉన్నారు. అరెస్టయిన నిందితులకు దేశవ్యాప్తంగా 1,055 సైబర్ నేరాలతో సంబంధం ఉన్నట్టు గుర్తించారు. వారి నుంచి సెల్‌ఫోన్లు, సిమ్‌కార్డులు, డెబిట్/క్రెడిట్ కార్డులు, ల్యాప్‌టాప్‌లు, రూ.36 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మోసాల్లో బాధితులు రూ.127 కోట్లు నష్టపోయినట్టు చెప్పారు.

# విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు హైకోర్టు ప్రశంస

అమరావతి: విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను హైకోర్టు ప్రశంసించింది. ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరులోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులను ఎలుకలు కొరికిన ఘటనపై మంత్రి లోకేశ్ వెంటనేస్పందించారనికితాబిచ్చింది. దాంతో జిల్లా యంత్రాంగమంతా వెళ్లి విద్యార్థినులను ఆదుకున్నారని తెలిపింది. కస్తూర్బా పాఠశాలల్లో పనిచేస్తున్న బోధన సిబ్బందికి జీతభత్యాలు పెంచడంతో పాటు.. కేంద్రంతో చర్చించి శాశ్వత ప్రాతిపదికన పోస్టులను భర్తీచేస్తున్నట్లు మంత్రి లోకేశ్ శాసనసభలో ప్రకటించిన విషయాన్ని తాము పత్రికల్లో చూశామని తెలిపింది. మంత్రి ఈ స్థాయిలో పనిచేస్తుండగా.. కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రభుత్వానికి, మంత్రికి చెడ్డపేరు తెస్తున్నారని వ్యాఖ్యానించింది. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) పార్ట్‌టైం పీజీ టీచర్లు (పీజీటీ)/పిటిషనర్ల సేవలను కొనసాగిస్తామని కోర్టుకు హామీ ఇచ్చి.. దాన్ని ఉల్లంఘించినందుకు సుమోటోగా నమోదుచేసిన కోర్టుధిక్కరణ కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. కోర్టు ఆదేశాలు అమలుచేయని దిగువస్థాయి సిబ్బందిని రక్షించేలా సర్వశిక్షాభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తీరు ఉందని మండిపడింది. గత విచారణకు తమముందు హాజరైన శ్రీనివాసరావు.. బాధ్యులైన అధికారులకు నోటీసు ఇచ్చినట్లు చెప్పారని, తాజా అఫిడవిట్‌లో మాత్రం కోర్టు విచారణ తర్వాత నోటీసులు జారీచేసినట్లుందని గుర్తుచేసింది. ఆయన కోర్టును తప్పుదోవ పట్టించేలా వ్యవహరించారని, ఈ నేపథ్యంలో క్రిమినల్ కోర్టుధిక్కరణ కేసు నమోదు చేస్తామని, తగిన చర్యలు తీసుకునేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్, ట్రైనింగ్ మంత్రిత్వశాఖకు రాస్తామని హెచ్చరించింది.

# ముంచుకొస్తోంది ఏఐ సునామీ

కృత్రిమ మేధ (ఏఐ) ఒక సునామీలా ప్రపంచం మీదికి దూసుకొస్తోందని, కానీ, దానిని ఎదుర్కొనేందుకు సమాజం ఇంకా సిద్ధం కాలేదని ఆంథ్రోపిక్ సీఈఓ డారియో ఆమోడెయ్ పేర్కొన్నారు. ఆన్‌లైన్ బ్రోకరేజీ ప్లాట్‌ఫామ్ జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఏఐ భవిష్యత్తు, భారత ఐటీ రంగం, స్టార్టప్‌లు, కొత్త నైపుణ్యాలు, బయోటెక్నాలజీ వంటి అంశాలపై డారియో తన అభిప్రాయాలను పంచుకున్నారు. ముఖ్యాంశాలివీ..

**ఏఐని సురక్షితంగా మార్చేందుకే**

'అయిదేళ్ల క్రితం కంప్యూటర్‌తో సొంతంగా ఒక వ్యాసం రాయించడం/వీడియోను విశ్లేషించడం దాదాపు అసాధ్యం. ఇప్పుడు ఏఐ మోడల్స్ మానవ మేధస్సుకు సరిసమాన స్థాయికి చేరుకుంటున్నాయి. ఏఐ ఒక రసాయన చర్యలాంటిది. ఒక రసాయన చర్యకు ముడిపదార్థాలు అవసరమైనట్లే.. డేటా, కంప్యూటింగ్ శక్తి అనే ముడిపదార్థాల అందుబాటు పెరిగే కొద్దీ, ఏఐ సామర్థ్యం అద్భుతంగా మారుతుంది. ఈ అనూహ్య మార్పుల వల్ల రాబోయే ఆర్థిక, భౌగోళిక, భద్రతాపరమైన పరిణామాలపై ప్రభుత్వాలు ప్రజలకు ఇంకా పూర్తి అవగాహన రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఏఐని అత్యంత సురక్షితంగా, బాధ్యతాయుతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే నేను ఓపెన్ ఏఐ నుంచి బయటకు వచ్చి, ఆంథ్రోపిక్‌ను స్థాపించాను.

**భారత్ మాకు భాగస్వామి**

చాలా బహుళజాతి సంస్థలు భారతదేశాన్ని వినియోగదారుల మార్కెట్‌గానే చూస్తుంటాయి. కానీ, భారతీయ ఐటీ, కన్సల్టింగ్ కంపెనీలతో మేము (ఆంథ్రోపిక్) కలిసి పనిచేయాలనుకుంటున్నాం. భారతీయ కంపెనీలకు మా ఏఐ టూల్స్ అందించి, వారి సేవలను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నాం. ఇందువల్ల వారి సంస్థాగత సామర్థ్యాన్ని, మార్కెట్ నైపుణ్యాలను అద్భుతంగా పెంచొచ్చు. అంతేకానీ, ఉద్యోగులను తొలగించాల్సిన పని ఉండదు. గత అక్టోబరులో తొలిసారి భారత్‌ను సందర్శించినప్పటితో పోలిస్తే.. ఇప్పుడు ఇక్కడ మా వినియోగదారుల సంఖ్య, రాబడి రెట్టింపు అయ్యింది. ఏపీఐ మోడల్స్ ద్వారా భారత్‌లో ఎంతోమంది సొంత పరిష్కారాలను నిర్మించుకుంటున్నారు.

**అనుకరణ సాధ్యం కాకుండా..**

భారతీయ స్టార్టప్‌లు ఏపీఐలను ఉపయోగించుకుని, అప్లికేషన్ లేయర్‌లో కొత్త టూల్స్ నిర్మించొచ్చు. ప్రతి రెండు, మూడు నెలలకు వచ్చే కొత్త ఏఐ మోడల్స్ వాడుకుంటూ, ఇంతకుముందు సాధ్యం కాని కొత్త పరిష్కారాలను కనుక్కోవాలి. ఏఐ మోడల్స్ చుట్టూ ఒక చిన్న యూజర్ ఇంటర్‌ఫేస్ (యూఐ), ర్యాపర్‌లాంటి సాధారణ అప్లికేషన్లు చేయకూడదు. ఫైనాన్స్, బయాలజీ వంటి రంగాలపై దృష్టి పెట్టి, సులభంగా అనుకరించలేని బలమైన నమూనాలతో స్టార్టప్‌లను నిర్మించుకోవాలి.

**సింథటిక్ డేటాతో..**

ఏఐ మోడల్స్ మరింత సంక్లిష్టంగా అభివృద్ధి చెందే కొద్దీ, మనుషుల్లాగే నిర్ణయాలు తీసుకునే స్థాయి వస్తుందని నేను నమ్ముతున్నాను. ఓపెన్ వెబ్‌లో దొరికే సమాచారం కంటే, ఏఐ తనంతట తాను నేర్చుకునే సింథటిక్ డేటా ప్రాముఖ్యం భవిష్యత్తులో పెరుగుతుంది. ఏఐ సాంకేతికత భవిష్యత్తును నిర్ణయించడంలో ప్రభుత్వాలు, ప్రజల పాత్ర కచ్చితంగా ఉండాలి. అభివృద్ధి వేగం నెమ్మదించకుండా, అర్థవంతంగా, చురుకైన నియంత్రణ అవసరం.

# ఆ నలుగురూ వచ్చేశారు

హైదరాబాద్: మావోయిస్టు పార్టీ చరిత్రలో అత్యంత కీలక లొంగుబాటు.. మునుపెన్నడూ లేని రీతిలో ఒకేసారి నలుగురు అగ్రనేతలు జనజీవన స్రవంతిలో కలిశారు. పార్టీ అత్యున్నత నిర్ణాయక కమిటీ అయిన పొలిట్‌బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ ఎలియాస్ కుమ్మదాదా (62), కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్ (76), తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు ఎలియాస్ దామోదర్ (47), రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి ఎలియాస్ గంగన్న (62) మంగళవారం డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయారు. దేవ్‌జీ, సంగ్రామ్‌లకు రూ.25 లక్షల చొప్పున.. మిగిలిన ఇద్దరికీ రూ.20 లక్షల చొప్పున పునరావాసం చెక్కుల్ని అందించారు.

**సుదీర్ఘ ప్రస్థానం**

దేవ్‌జీ 44 ఏళ్లు, రాజిరెడ్డి 46 ఏళ్లు, దామోదర్ 28 ఏళ్లు, గంగన్న 36 ఏళ్లు పార్టీతో కొనసాగించిన అనుబంధం.. ఈ లొంగుబాటుతో ముగిసింది. ఈ సందర్భంగా ఎలాంటి ఆయుధాల్ని ప్రదర్శించకపోవడం గమనార్హం. పార్టీలో ప్రస్తుతం ఒకే ఒక్క పొలిట్‌బ్యూరో సభ్యుడు మిసిర్‌బెస్రా ఎలియాస్ సునిర్‌మాల్ మాత్రమే మిగిలారు. తెలంగాణ నుంచి అజ్ఞాతంలో ఉన్నవారు 11 మంది మాత్రమే. తాజా లొంగుబాటు.. మావోయిస్టులపై లభించిన ప్రధాన విజయమని తెలంగాణ పోలీసులు ప్రకటించారు. దీంతో మావోయిస్టు పార్టీ శకం చివరిదశకు చేరినట్లేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీకి ఏడాది కాలంగా సారథ్యం కరవైందని తేలింది. గత ఏడాది పార్టీ చీఫ్ బస్వరాజ్ మృతిచెందిన అనంతరం.. దేవ్‌జీ చీఫ్‌గా వ్యవహరించారనే ప్రచారం జరిగినా, అది వాస్తవం కాదని డీజీపీ వెల్లడించారు.

**జగిత్యాల జైత్రయాత్ర ప్రభావంతో..**

జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన తిరుపతి.. ఇంటర్ చదువుతున్నప్పుడే ర్యాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ)లో చేరి.. టౌన్ అధ్యక్షుడిగా పనిచేశారు. 1978 నాటి జగిత్యాల జైత్రయాత్ర ప్రభావంతో 1982లో 'పీపుల్స్‌వార్'లో చేరారు. పార్టీ అగ్రనేత గణపతి సూచనల మేరకు రాజిరెడ్డితో కలిసి దండకారణ్యానికి వెళ్లారు. 1984 87లో గడ్చిరోలి జిల్లా సిరొంచ దళానికి, 198789లో పెరిమిలి దళానికి కమాండర్‌గా పనిచేశారు. 1989లో గడ్చిరోలి డివిజన్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. 1991లో పెరిమిలి దళ సభ్యురాలు అరికె జైనీ ఎలియాస్ సృజనను వివాహం చేసుకున్నారు. 1993లో ఉత్తర గడ్చిరోలి సబ్‌డివిజన్ కార్యదర్శిగా.. 1995లో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2001లో కేంద్ర కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. అప్పటి నుంచి కీలకమైన సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎంసీ) సభ్యుడిగా కొనసాగారు. 2017లో పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యారు.

# శ్రీవారి ప్రతిష్ఠ దెబ్బతీసే కుట్ర

అమరావతి : వైకాపా ఐదేళ్ల పాలనలో తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి కృత్రిమ నెయ్యి లాంటి పదార్థాన్ని ఉపయోగించి వేంకటేశ్వరస్వామి పవిత్రతనే దెబ్బతీశారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో జంతుకొవ్వు కలిసిందని న్యాయస్థానంలో సిట్ దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్ 35వ పేజీలో స్పష్టంగా ఉందని వివరించారు. 'నెయ్యే కాని నెయ్యి వినియోగించడం అనేది ఒక అంశమే. దీని వెనుక శ్రీవారి ప్రతిష్ఠను దెబ్బతీయాలనే పెద్ద కుట్రకోణమే ఉంది. రాజశేఖరరెడ్డి హయాం నుంచే ఇది మొదలైంది. వైకాపా పాలనలో ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ నుంచి నేతల వరకు ఆ అరాచకాలను కొనసాగించారు' అని దుయ్యబట్టారు. 'సిట్ నివేదికకు అనుగుణంగా అధికారులపై చర్యలు తీసుకున్నాక ప్రభుత్వం మౌనంగా ఉంది. అయితే తప్పు చేసిన వైకాపా నేతలు.. మమ్మల్నే క్షమాపణ చెప్పాలంటున్నారు. నీతి, నిజాయతీ కలిగిన మమ్మల్ని దోషులుగా చూపాలని తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారు. నాలుగు రోజులు శాసనమండలిలో గొడవ చేశారు. రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనపైనా చర్చించకుండా అడ్డుపడ్డారు' అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో మంగళవారం కల్తీ నెయ్యి వ్యవహారంపై లఘుచర్చలో చంద్రబాబు మాట్లాడారు. దీనిపై సమగ్ర ప్రజంటేషన్ ఇచ్చారు. 'చేసిన తప్పులు కప్పిపుచ్చుకునేందుకు నాటకాలు ఆపండి, పవిత్రత కాపాడండి. దేవాలయాల జోలికి రావద్దు.. హిందువుల మనోభావాలు దెబ్బతీయొద్దు' అని వైకాపా నేతల్ని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం 94% స్ట్రైక్‌రేట్‌తో గెలిచి అధికారంలోకి వచ్చిందంటే దానికి వేంకటేశ్వరస్వామి కృపే కారణమని చంద్రబాబు స్పష్టం చేశారు. సీఎం ప్రసంగంలోని ముఖ్యాంశాలు..

**హిందూ ధర్మాన్ని హేళన చేశారు**

201924 మధ్య వైకాపా నేతలు ఎన్నో కుట్రలు చేశారు. రాష్ట్రంలో 2,032 దేవాలయాలపై దాడులు జరిగాయి. 32 విగ్రహాలను అపవిత్రం చేశారు. 59 విగ్రహాలు చోరీ అయ్యాయి. అయినా కేసులు నమోదుచేయలేదు. పిచ్చివాళ్ల చేష్టలు, వీధికుక్కలు చేశాయి, గుప్తనిధుల వేట అని తేలిగ్గా తీసుకున్నారు. విగ్రహమే కదా.. ఏముంది అంటూ చులకనగా మాట్లాడారు. వైకాపా హయాంలో తిరుమలతిరుపతి బస్సు టికెట్లపై 'తక్కువ ఖర్చు, అన్ని సౌకర్యాలతో క్రైస్తవులకు పవిత్ర జెరూసలెం యాత్ర' అని ముద్రించి అన్యమత ప్రచారానికి పాల్పడ్డారు. 2018లో పింక్ డైమండ్ చోరీ అయిందని, అది మా ఇంట్లో ఉందని ప్రచారం చేశారు. అప్పుడే వారిని పట్టుకొచ్చి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదు. కానీ మేం ప్రజాస్వామ్యయుతంగా వెళ్లాలని రూ.100 కోట్లకు పరువునష్టం దావా వేశాం. వైకాపా ప్రభుత్వం వచ్చాక ఆ కేసు విత్‌డ్రా చేసుకున్నారు. మళ్లీ మేం వ్యక్తిగతంగా ఇంప్లీడ్ అయి పోరాడుతున్నాం. తితిదే బోర్డును రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారు. వైకాపా హయాంలో 2021లో 50 మంది ప్రత్యేక ఆహ్వానితుల్ని నియమించారు. మొత్తం 85 మందితో జంబో బోర్డు ఏర్పాటుచేశారు. హైకోర్టు ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుపట్టింది. (నేనే ఫైట్ చేశాను అని సభాపతి స్థానంలో ఉన్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజు చెప్పగా.. చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు.

# నాతో ఆటలాడొద్దు...

న్యూఢిల్లీ : వాణిజ్య భాగస్వామ్య దేశాలపై తాను విధించిన సుంకాలను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో కంగు తిన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా ఆయా దేశాలకు హెచ్చరిక జారీ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపించి వాణిజ్య హామీల నుంచి వెనక్కి తగ్గితే ఊరుకునేది లేదని అంటూ తనతో ఆటలాడాలని చూడవద్దని, అలా చేస్తే భారీగా సుంకాలు వడ్డిస్తానని బెదిరించారు. అమెరికాలో తన వాణిజ్య బృందం పర్యటనను భారత్ వాయిదా వేసుకున్న గంటల వ్యవధిలోనే ఈ హెచ్చరిక జారీ కావడాన్ని గమనిస్తే ఆయన మన దేశాన్నే లక్ష్యంగా చేసుకున్నారన్న సందేహం కలగక మానదు.

**బేరసారాలకు అవకాశం**

ఏదేమైనా ట్రంప్ తాజా బెదిరింపు భారత్‌ను ఉద్దేశించి చేసిందేనని అర్థమవుతోందని వాణిజ్య శాఖ మాజీ కార్యదర్శి కన్వల్ సిబల్ చెప్పారు. భారత్‌ను ఉద్దేశించే ఆయన 'దోపిడీ' అనే పదాన్ని ఉపయోగించారని తెలిపారు. కాగా ట్రంప్ ప్రభుత్వం బలహీన పడిందని, దాని నుంచి ప్రయోజనం పొందాలని కొన్ని దేశాలు ప్రయత్నిస్తాయని మాజీ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ అన్నారు. భారత్‌కు సంబంధించినంత వరకూ గతంలో అంగీకరించిన 18 శాతం సుంకాలతో పోలిస్తే తాజాగా విధించిన 15 శాతం సుంకాలు ఊరట కలిగించేవే. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సుంకాలపై భారత్ బేరసారాలకు దిగేందుకు, మరిన్ని సానుకూల నిర్ణయాలు పొందేందుకు అవకాశం కలిగింది

# 48 వ వార్డు కార్పొరేటర్ యామ కవితకు ఆత్మీయ సన్మానం



నల్లగొండ ,ప్రజాస్ఫూర్తి : ఇటీవల నల్లగొండ కార్పొరేషన్ కు జరిగిన ఎన్నికలలో 48 వ డివిజన్ నుండి భారీ మెజార్టీతో గెలుపొందిన యామా కవిత దయాకర్ ను సోమవారం రాత్రి 48వ డివిజన్ కనకదుర్గ వీధికి చెందిన ప్రజలు స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనంలో ఆత్మీయ సన్మాన సత్కారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదుర్గ వీధి ప్రజలు యమ కవితా దయాకర్ దంపతులను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కవితా రాణి మాట్లాడుతూ వార్డుకు సంబంధించిన ఏ సమస్య అయినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు,కనకదుర్గ ఆలయ అభివృద్ధి కోసం నూతన కమిటీని ఏర్పాటు చేసి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు, అలాగే డివిజన్లో మురికి కాలువలు, వీధి దీపాలు, తాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు, తనపై నమ్మకం ఉంచి తనను భారీ మెజార్టీతో గెలిపించిన ఓటర్లకు ఆమె కృతజ్ఞతలు తెలుపుతూ డివిజన్ అభివృద్ధికి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మి శెట్టి శ్రీనివాస్, కనకదుర్గ వీధి ముఖ్య నాయకులు, కలశం అశోక్ సకినాల వెంకన్న, ఆకవరం రాజు,నాయిని ప్రసాద్, గడగోసు విజయ్,పోలాగోని హరికృష్ణ, అన్న భీమోజు ప్రవీణ్ కుమార్, సోమచంద్రశేఖర్.మహిళలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డికి ఘన సన్మానం



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్లగొండ కార్పొరేషన్ మొట్టమొదటి మేయర్గా ఎన్నికైన బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డిని మంగళవారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ లోని బిటిఎస్ దుర్గా కాలనీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి దంపతులను స్థానిక కార్పొరేటర్ పున్న జ్ఞానేశ్వరి గణేష్, 22వ డివిజన్ కార్పొరేటర్ అమీనా ఫర్హీనా సమద్ దంపతులను అంబేద్కర్ భవన్ లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి గార్లు మాట్లాడారు.పార్టీలకు అతీతంగా డివిజన్లోని అన్ని కాలనీలలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారుసొసైటీ చైర్మన్ నీరుడు వెంకట్ రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఎల్ పిచ్చయ్య, ఎన్ పరమేశ , చిన్న వెంకట రాములు, వెంకటయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయిలో రెండవ బహుమతి అందుకున్న రాఘవేంద్ర కరిమల కళాశాల విద్యార్థి



ప్రజాస్ఫూర్తి , జన్నారం : ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బై పీ సి మొదటి సంవత్సరం చదువుతున్న కొట్టె అభిషేక్ రెండవ బహుమతిగా సి ఎం కప్ గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ అభిషేక్ ను అభినందిస్తూ, పిల్లలకు ఇలాంటి కళలు ఎంతో అవసరమని ఇలాంటి కప్ లు మరెన్నో గెలిచి, కళాశాలకు తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎర్ర సంపత్, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్, డీన్ హేమలత షిండే, కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మిమిక్రీ రమేష్కు ఘన సన్మానం




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: గంజాయి మత్తు వాడకం, మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలు మరియు రోడ్డు భద్రతపై కొత్తగూడెం క్లబ్లో నిర్వహించిన మోటివేషన్ కార్యక్రమంలో మిమిక్రీ కళాకారుడు రమేష్ తన వంతు పాత్రగా అవగాహన కల్పించారు. కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన అరైవ్అలైవ్2026 కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డి.ఎస్.పి ఆదినారాయణతో పాటు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.సుమారు 3 వేల మంది విద్యార్థులు హాజరైన ఈ కార్యక్రమంలో రమేష్ రోడ్డు భద్రతా నియమాలు, హెల్మెట్ ప్రాధాన్యత, ర్యాష్ డ్రైవింగ్ ప్రమాదాలు, సైబర్ మోసాలపై తనదైన హాస్యశైలిలో మిమిక్రీ ప్రదర్శించి విద్యార్థులను ఆకట్టుకున్నారు. వినోదంతో కూడిన సందేశం ద్వారా చైతన్యం కలిగించిన రమేష్ను జిల్లా ఎస్పీ ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు చప్పట్లతో స్పందిస్తూ సందేశాన్ని స్వాగతించారు.

# ఇబ్బందులు లేకుండా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి

* **జిల్లా అధికారులకు సూచించిన కలెక్టర్ నారాయణ రెడ్డి**




రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి : ఈ నెల 25వ తేదీ బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను ఎలాంటి చిన్న తప్పిదాలకు తవ్వివకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరం నుంచి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత ఆర్డీఓలు, ఎంపిడిఓలు, ఆర్.సి.లు, పోలీస్ శాఖ అధికారులు, విద్యుత్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25వ నుంచి మార్చ్ 18 వరకు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు చేపట్టవలసిన పనులను సమన్వయంతో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 200 పరీక్షా కేంద్రాల ద్వారా 84,301 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 70,171 మంది రెండవ సంవత్సరం విద్యార్థులు, జిల్లాలో మొత్తం 1,54,472 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. 31 ప్రశ్న పత్రాల స్టోరేజ్ పాయింట్లు ఉంటాయన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, మాస్ కాపీయింగ్ కు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోలీస్ శాఖ వారు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించాలని, పరీక్షా పరీక్షా సమయంలో జీరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేలా ఆర్టీసీ అధికారులు బస్సులను నడపాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో మెడికల్ పాయింట్ ఏర్పాటు చేసి సిబ్బంది కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా వైద్య అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. విద్యుత్ శాఖ అధికారులు పరీక్షా కేంద్రాలలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోస్టల్ శాఖ వారు జవాబు పత్రాలను సరిగా రిసీవ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో అవసరమైన మంచినీరు, ఫాన్స్, టాయిలెట్స్ ఏర్పాట్లు సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎవ్వరూ కూడా మొబైల్ ఫోన్స్ తీసుకెళ్లకూడదని, విద్యార్థులు పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికాలు, ముఖ్యంగా మొబైల్ ఫోన్లు తీసుకెళ్లకుండా పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు జగదీశ్వర్ రెడ్డి, అనంత్ రెడ్డి, సరిత, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంక్యా నాయక్, విద్యాశాఖ అధికారి సుసిందర్ రావు, వైద్య ఆరోగ్య శాఖ అధికారి లలితా దేవి, పోలీస్ అధికారులు, పోస్టల్ శాఖ అధికారులు, ఆర్టీసీ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

* **ఇంటర్ పరీక్షలకు జిల్లాలో 45 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు**
* **జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ వెల్లడి.**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : బుధవారం నుండి మార్చి 18 వరకు జిల్లాలో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితారాణా, ఇంటర్ విద్య శాఖ కమిషనర్ కృష్ణాదిత్యలతో కలిసి హైదరాబాద్ నుండి ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షల పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ పరీక్షల ఏర్పాట్లపై మాట్లాడుతూ బుధవారం నుండి మార్చి 18 వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లాలో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు 45 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం, జనరల్ ,ఒకేషనల్ విద్యార్థులు కలుపుకొని 27018 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించేందుకు గాను సంబంధిత అధికారులతో ఇది వరకే సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించడం జరిగిందని , ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వం 5 నిమిషాల సడలింపు ఇచ్చిందని, 5 నిమిషాల తర్వాత ప్రధాన గేట్లు మూసి వేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.ఇంటర్ పరీక్షల సందర్భంగా అన్ని పరీక్ష కేంద్రాలలో శానిటేషన్ తో పాటు, తాగునీరు, నిరంతరాయ విద్యుత్తు సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించడం జరగదని, పరీక్ష విధులు నిర్వహించే వారికి గుర్తింపు కార్డులు జారీ చేయడం జరుగుతుందని ,పరీక్షల సందర్భంగా ఫ్లైయింగ్ స్క్వాడ్ తో పాటు, సిట్టింగ్ స్క్వాడ్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షల సందర్భంగా హెల్ప్ లైన్ ఏర్పాటు చేశామని, పరీక్షలకు సంబంధించి హెల్ప్ లైన్ నెంబర్ 9848309004 కు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన కోరారు. పరీక్షల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ఆయా శాఖల అధికారులు ప్రత్యేకించి ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని, విద్యుత్ అధికారులు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, మెడికల్ అండ్ హెల్త్ అధికారులు పరీక్ష కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేయాలని, శానిటేషన్, డ్రింకింగ్ వాటర్, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.పరీక్ష కేంద్రం పరిధిలో 163 బిఎన్ఎస్ఎస్ చట్టం అమలు చేయాలని, పరీక్షలు నిర్వహించే రోజున పరీక్ష కేంద్రం చుట్టుపక్కల జిరాక్స్ కేంద్రాలన్నీ మూసివేయాలని ఆయన ఆదేశించారు. ఇంటర్ పరీక్షలకు 45 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 45 మంది డిపార్ట్మెంటల్ అధికారులను నియమించడం జరిగిందని వెల్లడించారు.జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలకు, అలాగే వచ్చే నెల 14 నుండి నిర్వహించనున్న పదవ తరగతి పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సవ్యంగా నిర్వహించాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కృష్ణారావు ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పారదర్శకంగా,సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ,నల్గొండ ఆర్ డి ఓ వై. అశోక్ రెడ్డి ,జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దశ్రు నాయక్, డిఈఓ బిక్షపతి, సంబంధిత శాఖల అధికారులు, ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

# స్వీయ క్రమశిక్షణతోనే లక్ష్యసాధన — ఎస్పీ రోహిత్ రాజు

* **రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి పాటించాలి**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం క్లబ్లో కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్ అలైవ్2026 అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో సుమారు 3,000 మంది విద్యార్థులు హాజరయ్యారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, డిఫెన్సివ్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్ఫోన్ వినియోగం, రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్ ప్రమాదాలపై ఎస్పీ అవగాహన కల్పించారు. స్వీయ క్రమశిక్షణతో ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. సైబర్ నేరాలు, ఓటీపీ మోసాలు, ఆన్లైన్ ట్రేడింగ్, హనీ ట్రాప్లపై జాగ్రత్తలు సూచించారు. గంజాయి సరఫరా లేదా వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఎస్పీ ఆదినారాయణ, ఎస్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సీఐలు కరుణాకర్, ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు రమణారెడ్డి, ప్రవీణ్, రమాదేవి, విజయ, రాకేష్, విజయసింహారెడ్డి, ఉమ పాల్గొన్నారు.



# పసికందు మరణానికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలి

* **ముస్తాబాద్లో బీసీ, ఎస్సీ సంఘాల భారీ నిరసన**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో కుల వివక్షతో దాడి చేసి, రెండు నెలల పసికందు మరణానికి కారణమైన నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ముస్తాబాద్ మండల కేంద్రంలో నిరసన జ్వాలలు మిన్నంటాయి. మంగళవారం స్థానిక చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద మండల రజక సంఘం, బీసీ, ఎస్సీ సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కుల అహంకారంతో బీసీ, దళిత కుటుంబానికి చెందిన గణేష్, చంద్రకళలపై అమానుషంగా దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. ఈ దాడిలో రెండు నెలల పసికందు ప్రాణాలు కోల్పోవడం సమాజానికే సిగ్గుచేటని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఘటనపై తక్షణమే స్పందించాలని, నిందితులపై హత్య కేసుతో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. బాధితులైన గణేష్, చంద్రకళ కుటుంబానికి ప్రభుత్వం తరపున 50 లక్షల రూపాయల ఆర్థిక సాయం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్లో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే ఈ కేసులో నిందితులను కఠిన శిక్ష అమలు చేయాలని, ఆ రజక కుటుంబానికి న్యాయం జరిగే వరకు బడుగు బలహీన వర్గాలన్నీ ఐక్యంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఇలాంటి అమానుష ఘటనలను అన్ని వర్గాల వారు ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక మండల సంఘం నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు, ఎస్సీ సంఘాల నాయకులు, వివిధ ప్రజా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు సమస్యలను పరిశీలించిన జోనల్ కమిషనర్




మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : యాప్రాల్ నాగి రెడ్డి చెరువు , కార్గిల్ గేట్ హనుమాన్ ఆలయం నుండి బాలాజీ నగర్ వరకు ఉన్న 100 అడుగుల రోడ్డు విస్తీర్ణానికి సంబంధించిన సమస్యలకు సంబంధించి జేఏసీ యాప్రాల్ కాంగ్రెస్ నాయకులు సోమవారం జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు సమర్పించారు. జోనల్ కమిషనర్ ఆ ప్రదేశాన్ని సందర్శించి తనిఖీ చేశారు. ఇరుకైన రోడ్డు కారణంగా భారీ ట్రాఫిక్ రద్దీని గమనించారు. కొన్ని కారణాల వల్ల రోడ్డు అభివృద్ధి పనులు ఆగిపోయాయి. పని స్థితిని తనిఖీ చేసి, వీలైనంత త్వరగా అవసరమైన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ ను అభ్యర్థించారు.

# మున్సిపల్ చైర్మన్ ను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



ప్రజాస్ఫూర్తి, పెబ్బేర్ (వనపర్తి జిల్లా) : ఇటీవలే జరిగిన పెబ్బేరు మునిసిపాలిటీ ఎన్నికలలో కౌన్సిలర్ గా గెలిచి మున్సిపల్ చైర్మన్ గా శ్రీనివాస్ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీరంగాపూర్ మండలం నాగసానిపల్లి గ్రామ సర్పంచ్ సుజాత రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆయన ను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన కూడా సర్పంచ్ ఉప సర్పంచ్ లను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భరత్ కుమార్, మండల కాంగ్రెస్ నాయకులు భీరం రాజశేఖర్ రెడ్డి, ఎల్ల స్వామి, మాజీ ఉపసర్పంచ్ కురుమూర్తి, తిరుపతయ్య, గోవిందు, కిరణ్, వీరబ్రహ్మం, పరమేష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శివస్వాముల పాదయాత్ర



జిన్నారం, ప్రజాస్ఫూర్తి : జిన్నారం గుమ్మడిదల మండలం శివస్వాములు పాదయాత్రగా బయలుదేరారు.బొంతపల్లి వీరభద్ర స్వామి దేవస్థానం నుండి జనగామ జిల్లా ఆలేరులోని కొలనుపాక సోమేశ్వర చండికామాత ఆలయం వరకు శివ మాలధారణ చేసిన అనిల్ గురు స్వామి ఆధ్వర్యంలో మంగళవారం పాదయాత్ర చేపట్టారు. పాదయాత్ర కార్యక్రమంలో శ్రీకాంత్, ప్రభాకర్, శ్రావణ్, సంగమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ విజయాలు జిల్లాకు గర్వకారణం – కలెక్టర్ జితేష్ వి. పాటిల్



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారులు 54 పతకాలు సాధించడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. వీరిలో 15 బంగారు, 19 వెండి, 20 కాంస్య పతకాలు ఉండగా, అథ్లెటిక్స్లోనే 31 పతకాలు సాధించడం విశేషమన్నారు.మంగళవారం ఐడీఓసి కార్యాలయంలో విజేతలను అభినందించిన కలెక్టర్, గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులు ప్రతిభ చూపడం ఆనందదాయకమని చెప్పారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, జట్టు భావన పెంపొందిస్తాయని, పాఠశాల స్థాయిలోనే ప్రతిభను ప్రోత్సహించాలని సూచించారు.కార్యక్రమంలో యువజన, క్రీడల అధికారి పరంధామ రెడ్డి, నరేష్, అనురాధ, మహిధర్, వెంకటనారాయణ, రమేష్, వెంకటరామిరెడ్డి, మంజిలాల్, నాగలక్ష్మి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో పలువురికి సన్మానం



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో సమితి అధ్యక్షులు డాక్టర్ జల్దీ విద్యాధర్ సారథ్యంలో కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోగంటి ఉషారాణి డా.ఝాన్సీ ముడుంబై సమన్వయ కర్తలుగా కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో హైదరాబాద్ అత్తాపూర్ నివాసి ప్రముఖ కవి రచయిత నటుడు పోలయ్య కవి కూకట్లపల్లి పాల్గొని" జై తెలుగుతల్లి జయహో తెలుగు తల్లి" కవితను గానంచేసి ప్రముఖులచే ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య కొలకలూరి ఇనాక్ కళారత్న డాక్టర్ బిక్కికృష్ణ డాక్టర్ జల్దీ విద్యాధర్ పోలయ్య కవిని ఘనంగా సత్కారించారు. ఈ సభకు ఆచార్య పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాతృభాషా పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతంటూ తెలిపారు. డాక్టర్ విజయలక్ష్మి పండిట్, కోయి కోటేశ్వరరావు, శైలజా మిత్ర, సరికొండ నరసింహ రాజు, నాళేశ్వరం శంకరం, వైరాగ్యం ప్రభాకర్, డా.రాధా కుసుమ, డాక్టర్ మునగా రామ మోహన్ రావు తదితర సాహితీ మూర్తులు హాజరై మాతృభాషపై ప్రసంగించారు.తదనంతరం అతిథులకు కవితా గానం చేసిన కవులకు కవయిత్రులకు ఆత్మీయ సత్కారం జరిగింది.

# అర్ధరాత్రి విద్యుత్ అంతరాయం

* **రామవరంలో రెండున్నర గంటల చీకటి**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: అందరూ గాఢనిద్రలోకి జారుకున్న అర్ధరాత్రి వేళ రామవరం చీకటిలో మునిగింది. తేలికపాటి వర్షం కురవడంతో నాగయ్యగడ్డ, 14 నెంబర్ ప్రాంతాల్లో విద్యుత్ తీగలపై చెట్టు కొమ్మలు విరిగిపడినట్లు సమాచారం. దీంతో ఇన్సులేటర్ దెబ్బతిని విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని సిబ్బంది తెలిపారు. సుమారు రెండున్నర గంటలపాటు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.ఇప్పటికే ఎండ తీవ్రత పెరుగుతున్న వేళ రాత్రి వేళల్లో ఫ్యాన్లు, కూలర్లు ఆగిపోవడంతో చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడ్డారు. గత కొద్ది రోజులుగా రాత్రిపూట అనియంత్రిత అంతరాయాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు.ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ నిలిపివేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవి పూర్తిగా ప్రారంభమయ్యేలోపే ఈ తరహా కోతలు ఆందోళన కలిగిస్తున్నాయని చెబుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, కోతలపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

# నేడు నవపేట లో శ్రీ పార్వతీ పరమేశ్వర స్వామి కళ్యాణోత్సవం



వికారాబాద్ జిల్లా నవపేట్ మండలంలో ఎల్లకొండ గ్రామంలో పశ్చిమ తెలంగాణల కాశీగా పిలువబడే స్వయంభుగా వెలిసిన శ్రీ పార్వతి పరమేశ్వరులు వార్షికోత్సవ వేడుకలు ఘనంగా మొదలయ్యాయి. క్రీస్తు శకం 8వ శతాబ్దంలో వెలిసిన అతి పురాతణమైన ఆలయంగా ప్రసిద్ధి చెందిన ఆలయం ఇది. దేవాలయ వంశపారం పర్యంగా ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం మహాశివరాత్రి మొదలుకొని మార్చ 1 తేదీ వరకు వేడుకలు జరుగుతాయి. ఇందులో బుధవారంపార్వతీ పరమేశ్వరులు కళ్యాణం మహోత్సవ వేడుకలు కనుల పండుగ జరుపనున్నారు. ఈనెల 27 తెల్లవారుజామున 4 గంటలకు రథోత్సవం ఉంటుంది.

# ఫిబ్రవరి నెలది.. చిన్న కథ కాదు..!




ఒక్క ఫిబ్రవరిలో మాత్రం ఎందుకని 28 రోజులున్నాయని ఎప్పుడైనా ఆలోచించారా? దీనికి ప్రాచీన రోమన్ల మూఢనమ్మకాలే కారణం. మొదట్లో రోమన్ క్యాలెండర్‌లో కేవలం 10 నెలలే(మార్చి నుంచి డిసెంబరు వరకు) ఉండేవి. తరువాత క్రీస్తు పూర్వం 713లో రోమన్ రాజు 'నుమా పోంపిలియస్' చంద్రుని గమనాన్ని బట్టి క్యాలెండర్‌ను 12 నెలలుగా మారుస్తూ జనవరి, ఫిబ్రవరిలను చేర్చారు. అలాగే రోమన్లు సరిసంఖ్యలను అరిష్టంగా భావిస్తారు. 12 చంద్ర చక్రాలు పూర్తి కావడానికి సుమారు 354 రోజులు పడుతుంది. కాబట్టి మొదటి క్యాలెండర్ 354 రోజులతోనే ప్రారంభమైంది. ఇది సరి సంఖ్య కావడంతో చక్రవర్తి మరో రోజును అదనంగా కలిపి మొత్తం 355 రోజులు చేశారు. తర్వాత ప్రతి నెలలోనూ బేసి సంఖ్యలు ఉండేలా 29 లేదా 31 రోజులకు విభజించారు. అయినా ఒక నెలలో సరి సంఖ్య ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పటి క్యాలెండర్‌లో ఫిబ్రవరి చివరి నెలగా ఉండేది. ఆ నెలను రోమన్లు శుద్ధీకరణ(ఫిబ్రం), చనిపోయిన వారిని స్మరించుకునే నెలగా భావించేవారు. దీన్ని అశుభ నెలగా భావిస్తూ 28 రోజులు కేటాయించారు. తర్వాత జూలియస్ సీజర్ క్యాలెండర్‌ను సవరించినపుడు భూమి సూర్యుడి చుట్టూ తిరగడాన్ని బట్టి సంవత్సరానికి 365 రోజులుగా నిర్ణయించారు. దాని ప్రకారం నెలలనూ సవరించారు. ఫిబ్రవరిలో 28 రోజులను మాత్రం అలాగే ఉంచారు. ఇప్పటికీ అదే కొనసాగుతోంది. సూర్య సంవత్సరానికి సరిపడేలా ప్రతి నాలుగేళ్లకోసారి ఫిబ్రవరి నెలకు ఒక రోజును జోడించడంతో 29 రోజుల లీప్ ఇయర్ వస్తుంది.

# ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఖాళీ కుర్చీకే వినతి




మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ శ్రవణ్ అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు.మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజా సమస్యలు కుప్పలు కుప్పలుగా పేరుకుపోయాయని అన్నారు. తార్నాకలోని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వ హించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన శ్రవణ్, అనంతరం మల్కాజిరి జోనల్ కార్యాలయంలో కూడా వినతిపత్రం సమర్పిస్తూ తన నిరసన వ్యక్తం చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేయడానికి వెళ్లిన శ్రవణ్ కు కమిషనర్ ఖాళీ కుర్చీ మాత్రమే కని పించడంతో, నిరసనగా ఆ ఖాళీ కుర్చీకే వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ ఘటన అక్కడ ఉన్నవారిలో చర్చనీయాంశమైంది. శానిటేషన్ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, ఇతర అధికారులు వచ్చి ఆయనతో మాట్లాడి వినతిపత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ.. మల్కాజిగిరి పరిధిలో శానిటేషన్ వ్యవస్థ పూర్తిగా అటకెక్కిందని ఆరోపించారు. అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా ఫీల్డ్ ల్లోకి వచ్చి సమస్యలను స్వయంగా పరిశీలించాలని కోరారు. దోమల మందు పిచికారీ పూర్తిగా నిలిచిపోయిందన్నారు. స్ట్రీట్ లైట్ల నిర్వహణ పట్టించు కునే వారు లేరని, చెరువుల్లో గుర్రపుడెక్క వి స్తరిస్తోందని, తొలగింపు చర్యలు లేవని, టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రజలను వేధిస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. సమస్యలపై అధికారులు వెంటనే స్పందించకపోతే త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని శ్రవణ్ హెచ్చరించారు.

# నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర ఘటనలో నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి

* **బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపెందర్ డిమాండ్...**



ప్రజా స్ఫూర్తి , నల్గొండ : అగ్రకుల దురహంకారంతో బీసీ కుటుంబానికి చెందిన వారిపై అమానుషంగా దాడి చేసి పసికందు మరణానికి కారణమైన వాళ్లపై హత్యకేసు నమోదు చేసి నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీసీ యూత్ జేఏసీ చైర్మన్ కట్టెకోలు దీపెందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కట్టెకోలు దీపెందర్ మాట్లాడుతూ ఆరు రోజుల క్రితం టికెట్ లేకుండా కుమ్మెర గ్రామంలోని మల్లన్న గుడిలోకి ప్రవేశించిన కారణంగా చాకలి కులస్తులైన గణేష్ చంద్రకళ మౌనికలపై ఆ గ్రామ సర్పంచ్ తుకారం రెడ్డి మరియు సతీష్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మధుసూదన్ రెడ్డిలు ఇంకా కొంతమంది రాయలేని భాషలో దురహంకారంతో అతి కిరాతకంగా భయంకరంగా వారిపై దాడి చేసి మరియు రెండు నెలల పసి పాప ప్రాణాలు బలిగొన్న హంతకులను కఠినంగా శిక్షించి తక్షణమే బాధిత కుటుంబానికి భద్రత కల్పించి ప్రభుత్వ పరంగా యాభై లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నల్గొండ నియోజకవర్గ అధ్యక్షుడు బోళ్ల నాగరాజు, ఉపాధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, నల్గొండ పట్టణ అధ్యక్షుడు విశ్వనాధుల శివకుమార్, నిరుద్యోగ జేఏసీ జిల్లా చైర్మన్ పాల్వాయి రవి, కొడదల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ భద్రతపై అవగాహన సదస్సు




ప్రజాస్ఫూర్తి, శ్రీరంగాపురం (వనపర్తి జిల్లా) : శ్రీరంగాపురం మండల కేంద్రంలో కామన్ హాల్ లో మంగళవారం ఏర్పాటు చేసిన ఏపాక్ సైబర్ సెక్యూరిటీ శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ హ్యాండీక్రాఫ్ట్స్ అభివృద్ధి కమిషనర్ కార్యాలయ అధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 'ఫౌండేషన్ ఫర్ ఎంఎస్ఎంఈ క్లస్టర్స్' సీనియర్ మేనేజర్ రాజ్‌కుమార్ ఎం.వి. మాట్లాడుతూ.. సురక్షితమైన పాస్‌వర్డ్‌ల నిర్వహణ, అనుమానాస్పద లింకులను గుర్తించడం , డిజిటల్ లావాదేవీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథి విజేఎంఎస్ చైర్మన్ డాక్టర్ ఏకే కమర్ రహమాన్, ఎస్సై హిమబిందు, మాజీ జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్ యాదవ్, సర్పంచ్ మద్దిలేటి యాదవ్ పాల్గొని సైబర్ భద్రత ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వికసిత్ భారత్ ట్రస్ట్ చైర్మన్ కోళ్ల వెంకటేష్, ఉపసర్పంచ్ ఖాజా, గ్రామ పంచాయతీ సభ్యులు రాజ్యలక్ష్మి, పశుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లు కాంగ్రెస్ సర్కారుకు ఢోకా లేదు...

* **మండల కాంగ్రెస్ నాయకుడు కృష్ణ..**
* **మున్సిపల్ వైస్ చైర్మన్ చిట్టిబాబుకు శుభాకాంక్షలు**



అందోలు, ప్రజాస్ఫూర్తి : అందోలు జోగిపేట మున్సిపల్ 15వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొంది మున్సిపల్ వైస్ చైర్మన్ గా ఎన్నికైన ఆకుల చిట్టిబాబు ఎన్నిక పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయా సంఘాల నాయకులు, అభిమానుల నుండి శుభాకాంక్షలు వెలువెత్తుతున్నాయి. మంగళవారం అందోలు మండల పరిధిలోని కన్ సాన్ పల్లి గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు మొరబోయిన కృష్ణ, మాజీ ఎంపిటిసి బాలయ్య ఆధ్వర్యంలో పలువురు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజా రైతు సంక్షేమమే లక్ష్యంగా అహర్నిశలు పనిచేస్తుందన్నారు. పేదల పేదరికాన్ని నిర్మూలించాలనే సంకల్పంతోనే ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు."ఇందిరమ్మ ఇళ్లు పేదల కలల సాకార రూపమన్నారు. ఏ ఎన్నికలు జరిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమన్నారు. మొన్న సర్పంచ్ ఎన్నికలు, నిన్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందడం కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు ఉన్న విశ్వాసం బయటపడిందన్నారు. అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుతో ప్రభుత్వానికి చేకూర్చిందన్నారు. రాబోయే పదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే విజయమన్నారు

# మేయర్‌ను కలిసిన ప్రకృతి ప్రేమికులు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: నూతనంగా ఎన్నికైన కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్‌ను మంగళవారం ప్రకృతి ప్రేమికులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో మేయర్ గణేష్‌ను ప్రకృతి హరితదీక్ష వ్యవస్థాపకులు, మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీచే ప్రశంసలు అందుకున్న గ్రీన్ గార్డెన్ వెహికిల్ సృష్టికర్త, సింగరేణియన్ మొక్కల రాజశేఖర్, ప్రకృతి హరిదీక్ష గౌరవ సభ్యులు శనగ కళ్యాణ్ కుమార్, ప్రకృతి హరితదీక్షకురాలు చిన్నారి నైనిక రజువా కలిసి మొక్కలను అందచేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్‌కు ప్రకృతి హరితదీక్ష ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రతిరోజు కనీసం ఒక్క మొక్కనైనా నాటడమే లక్ష్యంగా ఈ దీక్ష చేపట్టడం జరిగింధని, రాష్ట్ర స్థాయిలో ఎన్నో అవార్డులు సైతం లభించాయని మొక్కల రాజశేఖర్ తెలిపారు. అనంతరం మేయర్ గణేష్ మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ కోసం హరిదీక్ష చేపట్టడం ఎంతో అభినందనీయమని, తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. హరితదీక్షకురాలు నైనిక రజువాను ప్రత్యేకంగా అభినందిస్తూ శాలువా కప్పి సన్మానించారు. చిన్నతనం నుంచే మొక్కలు నాటడాన్ని అలవాటుగా చేసుకోవడం శుభపరిణామమని, నైనికను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేయాలని, భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దశరథ్ రజువా, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా

**త్వరలో ప్రారంభించనున్న కేంద్రం**




దిల్లీ: మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తోపాటు, నివారించదగిన మరికొన్ని రకాల క్యాన్సర్లను అరికట్టేందుకు కేంద్రం నడుం బిగించింది. త్వరలో దేశవ్యాప్తంగా హ్యూమన్ పాపిలోమా వైరస్(హెచ్‌పీవీ) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. ఇందులో భాగంగా 14 సంవత్సరాల బాలికలకు 'గార్డాసిల్' అనే టీకాను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇవ్వనుంది. ఈ వ్యాక్సిన్ 4 రకాల గర్భాశయ క్యాన్సర్లను నిరోధిస్తుంది. క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ టైప్ 16, 18తోపాటు టైప్ 6, 11 రకాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుందని ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం నిర్వహించే సార్వజనీన టీకాల కార్యక్రమంలో భాగంగా కాకుండా ఇందుకోసం ప్రత్యేక వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపడతారని అధికారులు తెలిపారు. గర్భాశయ క్యాన్సర్ నివారణకు ప్రపంచ స్థాయి వ్యూహంలో భాగంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేపట్టాలంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన సిఫార్సు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఒక డోసు వ్యాక్సిన్ అందించడం వల్ల బాలికలకు సంబంధిత వైరస్‌ల నుంచి దీర్ఘకాల రక్షణ లభిస్తుందని దేశీయంగా, అంతర్జాతీయంగా జరిపిన శాస్త్రీయ పరిశోధనల్లో తేలింది. 15ఏళ్ల లోపు బాలికల కోసం ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న గార్డాసిల్ 4 టీకాను రెండు డోసుల్లో తీసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో డోసు ధర.3,927. అదే 15 ఏళ్ల వయసు పైబడిన బాలికలు మూడు డోసులు తీసుకోవాలి. ఈ వ్యాక్సిన్ 2006లో అందుబాటులోకి రాగా.. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటివరకు 50 కోట్ల డోసులను పంపిణీ చేశారు. దీంతో అనేక దేశాల్లో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్లు గణనీయంగా తగ్గినట్లు అంచనా. 160దేశాల్లో ఇప్పటికే ఈ టీకా పంపిణీ కార్యక్రమం అమల్లో ఉండగా.. వీటిలో 90 దేశాలు సింగిల్ డోసుగా అందిస్తున్నాయి. ప్రపంచంలో క్యాన్సర్ బాధితుల సంఖ్యాపరంగా చైనా, అమెరికా తర్వాత భారత్ మూడోస్థానంలో ఉంది. 2040 నాటికి దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య ఏటా 20 లక్షలకు చేరే అవకాశం ఉందని అంచనా. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఏటా 2 కోట్ల మంది క్యాన్సర్ బారిన పడుతుండగా.. వీరిలో 15 లక్షల మంది భారతీయులే ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

# భారాస మునిగిపోయే నావ..

హైదరాబాద్: "రాష్ట్రంలో భారాస మునిగిపోయే నావ. కాంగ్రెస్‌ని ఎదుర్కొనే దమ్ము, ధైర్యం ఉన్న పార్టీ భాజపానే. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాజపాను గెలవనీయకుండా కాంగ్రెస్, భారాస, ఎంఐఎం మూడు పార్టీలు అడ్డుకునే ప్రయత్నం చేశాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం భాజపాకు మేయర్ పదవి దక్కకుండా ప్రయత్నించినా కమలమే గెలుచుకొంది" అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మంగళవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్, పార్టీ కార్పొరేటర్లు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ మున్సిపాలిటీల్లో గెలిచిన కౌన్సిలర్లతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. అంతక్రితం పాత నగరంలోని భాగ్యలక్ష్మి దేవాలయాన్ని, లాల్‌దర్వాజాలోని సింహవాహిని మహంకాళీ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలోనూ మాట్లాడారు. "భారాస పనైపోయింది. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటు కూడా గెలుచుకోలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో దింపేందుకు ఆ పార్టీకి కనీసం అభ్యర్థులు లేరు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం భాజపా మాత్రమే. మరోపక్క కాంగ్రెస్‌లో ముసలం మొదలైంది. పలువురు మంత్రులపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. చాలా మంది శాసనసభ్యులు తమకు మంత్రి పదవి కావాలని కోరుతున్నారు. ఈ ప్రభుత్వానికి గ్యారంటీ లేదు.

* **భాగ్యలక్ష్మి దేవాలయాన్ని స్వర్ణ దేవాలయం తరహాలో అభివృద్ధి చేస్తాం**




భాజపాకు మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగింది. కరీంనగర్ కార్పొరేషన్, నారాయణపేట, భైంసా మున్సిపాలిటీలలో నెగ్గాం. ఇదే ఉత్సాహంతో జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ గెలవాలి. కొందరు పార్టీ గుర్తుతో నెగ్గి వ్యక్తిగత విజయం అనుకుంటారు. పార్టీ బీఫాంతో గెలిచి తామే గొప్ప అనుకున్న ఎంతో మంది కాలగర్భంలో కలిసిపోయారు. అందరికన్నా పార్టీ గొప్పది. ఒవైసీ కోసమే హైదరాబాద్ మహానగరపాలక సంస్థను మూడు ముక్కలు చేశారు. ఇందులో ఒక కార్పొరేషన్‌ను మజ్లిస్‌కు అప్పగించాలని కాంగ్రెస్ చూస్తోంది. 2028లో తెలంగాణలో భాజపాను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా అందరం కలిసి పనిచేద్దాం. అధికారంలోకి వచ్చిన వెంటనే చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయాన్ని స్వర్ణ దేవాలయం తరహాలో అభివృద్ధి చేస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై దాడులు పెరిగి పోయాయి. కాంగ్రెస్, భారాస నేతలు నిజంగా హిందువులు అయితే పార్టీలను వదిలి ధర్మం కోసం భాజపాలో చేరి కాషాయ జెండా పట్టాలి. మజ్లిస్ ఆగడాలకు భయపడి పాతబస్తీని వదిలి వెళ్లిన వారు తిరిగి పాతబస్తీకి రావాలి. భాజపా అండగా ఉంటుంది" అని బండి సంజయ్ అన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునిల్‌రావు, నాయకులు గౌతంరావు, అశోక్, వీరేంద్ర గౌడ్, మనోహర్‌రెడ్డి, పొన్న వెంకటరమణ, ఉమా మహేంద్ర, ఆలె జితేంద్ర, పాశం సురేందర్, ఆలె భాగ్యలక్ష్మి, సుభాష్ చందర్ జీ, మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా HPV వ్యాక్సిన్!

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించే హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను దేశవ్యాప్తంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రత్యేక టీకా కార్యక్రమంలో భాగంగా 14ఏళ్ల వయసు పైబడిన బాలికలకు ఉచితంగా అందించనున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఇందులో భాగంగా గార్డాసిల్ ఇంజెక్షన్ ను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ వ్యాక్సిన్ నాలుగు రకాల గర్భాశయ క్యాన్సర్‌లను నిరోధిస్తుంది. ఈ క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ టైప్ 16, 18 తోపాటు టైప్ 6, 11 రకాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుందని ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఒక డోసు వ్యాక్సిన్ అందించడం వల్ల బాలికలకు సంబంధిత వైరస్‌ల నుంచి దీర్ఘకాల రక్షణ కల్పిస్తుందని దేశీయంగా, అంతర్జాతీయంగా జరిపిన శాస్త్రీయ పరిశోధనల్లో తేలింది. జాతీయ కార్యక్రమంలో భాగంగా దీన్ని స్వచ్ఛందంగా, ఉచితంగా అందివ్వనున్నారు. 15ఏళ్ల లోపు బాలికల కోసం ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న గార్డాసిల్ 4 టీకాను రెండు డోసుల్లో తీసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో డోసు ధర. 3,927. అదే 15 ఏళ్ల వయసు పైబడిన బాలికలు మాత్రం మూడు డోసుల్లో తీసుకోవాలి. ఈవ్యాక్సిన్ 2006లో అందుబాటులోకి రాగా.. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 50 కోట్ల డోసులను పంపిణీ చేశారు. దీంతో అనేక దేశాల్లో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్లు గణనీయంగా తగ్గినట్లు అంచనా. 160 దేశాల్లో ఇప్పటికే ఈ టీకా పంపిణీ కార్యక్రమం అమల్లో ఉండగా.. వీటిలో 90 దేశాలు సింగిల్ డోసులో అందిస్తున్నాయి. ప్రపంచంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య పరంగా చైనా, అమెరికా తర్వాత భారత్ మూడోస్థానంలో ఉంది. 2040 నాటికి దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య ఏటా 20 లక్షలకు చేరే అవకాశం ఉందని అంచనా. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏటా 2 కోట్ల మంది క్యాన్సర్ బారిన పడుతుండగా.. వీరిలో 15 లక్షల మంది భారతీయులే ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.



## తమిళనాట శశికళ కొత్త పార్టీ




తమిళనాడులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ సీఎం దివంగత జయలలిత సన్నిహితురాలు వీకే శశికళ కీలక ప్రకటన చేశారు. త్వరలో తాను కొత్త పార్టీని స్థాపించనున్నట్లు వెల్లడించారు. జయలలిత జయంతి సందర్భంగా రామనాథపురంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో నూతన పార్టీకి సంబంధించిన జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత చూపిన మార్గంలో తమ పార్టీ పయనిస్తుందన్నారు. పేదలు, అణగారిన వర్గాలు, సామాన్య ప్రజల కోసమే పనిచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జయలలిత మరణాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.

## 2009లో అసెంబ్లీలో ప్రశ్న అడిగితే 12 ఏళ్లకు సమాధానం..!



మహారాష్ట్ర శాసనసభలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. చట్టసభ సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు ఆలస్యంగా సమాధానం ఇస్తున్నారని ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ మాట్లాడుతూ.. తనకూ గతంలో ఇటువంటి సమస్యే ఎదురైందన్నారు. 2009లో అడిగిన ప్రశ్నకు 2021లో సమాధానం వచ్చిందని గుర్తుచేసుకున్నారు. అధికార భాజపా ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుధీర్ ముంగంటివార్ సభలో మాట్లాడుతూ.. అధికారుల అలసత్వం అంశాన్ని లేవనెత్తారు. ఎమ్మెల్యేలు రాసే లేఖలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూడా స్పందించడం లేదని విమర్శించారు. ఓ ప్రశ్నకు నాలుగేళ్ల తర్వాత సమాధానం వచ్చిందన్నారు. ఇలాంటి విషయాల్లో జవాబుదారీతనం కోసం చట్టం తీసుకురావాలని, తప్పు చేసే అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండుకు మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ నేత విజయ్ వాడెట్టివార్.. సొంత ప్రభుత్వాన్ని భాజపా నేత ప్రశ్నించడం సమర్థనీయమేనని అన్నారు. అదే సమయంలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ జోక్యం చేసుకున్నారు. ముంగంటివార్ నాలుగేళ్లలో సమాధానం అందుకుంటే, తాను మాత్రం ఎమ్మెల్యేగా 2009లో ఓ ప్రశ్న అడిగితే 2021లో సమాధానం వచ్చిందన్నారు. అప్పటికే సీఎం అయ్యానని, ఆ తర్వాత విపక్ష నేతగా కూడా పనిచేసినట్లు గుర్తు చేసుకున్నారు. ఈ అంశంపై స్పీకర్ రాహుల్ నర్వేకర్ స్పందిస్తూ.. సభ్యుల ప్రశ్నలకు అధికారుల నుంచి వేగంగా స్పందన వచ్చేలా డిజిటల్ వేదికను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. దాంతో ఎవరు బాధ్యులనేది తెలుతుందన్నారు.

## గోదావరిలో 'గోల్డ్ రష్'.. గ్రామస్థుల వేట!




నది ప్రవాహం తగ్గిపోతోందంటే పరివాహకప్రాంతంలోని రైతులు, మత్స్యకారులు సహా వాటిపై ఆధారపడే వారిలో కలవరం మొదలవుతుంది. కానీ, మహారాష్ట్రలోని పైఠణ్ పట్టంలో మాత్రం స్థానికుల కొత్త ఆశలకు ఊపిరి పోస్తుంది. అక్కడ ప్రవహించే గోదావరి నదిలో (Go davari) నీటి ప్రవాహం తగ్గడమే తరువాయి.. వలలు, జల్లెడలతో రంగంలోకి దిగుతారు. బంగారం, ఇతర విలువైన వస్తువులు లభ్యమవుతాయనే ఆశతో అన్వేషణ మొదలుపెడతారు. ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో పైఠణ్ పట్టణాన్ని పవిత్ర ప్రదేశంగా భావిస్తారు. మరణించిన వారి కుటుంబ సభ్యులు, బంధువులకు ఇక్కడ అంతిమ సంస్కారాలు చేస్తుంటారు. అనంతరం వారికి సంబంధించిన ఆభరణాలు, నాణేలు, ఇతర విలువైన వస్తువులను అందులో వేస్తుంటారు. ఇలా వేసిన వాటిని గాలించి తీసుకునేందుకే చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఎగబడుతుంటారు. అక్కడ తాజాగా గోదావరి ప్రవాహం తగ్గడంతో సమీప గ్రామాల ప్రజలు నది ఒడ్డుకు చేరుకున్నారు. నడుములోతు ఉన్న నీటిలోకి దిగి.. జల్లెడలు, వలలతో విలువైన వస్తువుల కోసం వేట (Godavari Gold) కొనసాగిస్తున్నారు. నది గర్భంలో బురదను తీసి జల్లెడ పడుతున్నారు. ఈ క్రమంలో ఏదైనా విలువైన వస్తువు లభ్యమైతే దాన్ని భగవంతుడు తమకు ఇచ్చిన కానుకగా భావిస్తామని స్థానికులు పేర్కొనడం గమనార్హం.

## ఇరాన్‌తో ఉద్రిక్తతల వేళ.. అమెరికా యుద్ధనౌకలో 'టాయిలెట్ వార్'



అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతోన్న నేపథ్యంలో ఇప్పటికే భారీస్థాయిలో అమెరికా సైన్యం ఇరాన్‌ను చుట్టుముట్టిన విషయం తెలిసిందే. అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ సహా పలు యుద్ధనౌకలను ఇరాన్ దిశగా తరలించింది. అయితే యుద్ధం ప్రారంభించకముందే అమెరికా సిబ్బంది తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. విమాన వాహక నౌకలో విధులు నిర్వహిస్తోన్న 4500 సిబ్బంది 'టాయిలెట్' కష్టాలను ఎదుర్కొంటున్నట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదికలు వెల్లడిస్తున్నాయి. నివేదికల ప్రకారం.. ఎనిమిది నెలలుగా నడి సముద్రంలో ఉన్న యుద్ధనౌక (Gerald R Ford)లోని మురుగునీటి వ్యవస్థలో ఇటీవల వైఫల్యం తలెత్తింది. యుద్ధనౌక నిరంతరం కదులుతున్నందున, సరైన నిర్వహణ లేకపోవడం వల్ల అందులో ఉన్న మొత్తం 650 మరుగుదొడ్లలో చాలా వరకు పనిచేయడం లేదు. దీంతో మహిళా సిబ్బందితో పాటు పురుషులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాత్రూంను ఉపయోగించుకోవాలంటే సిబ్బంది రోజు దాదాపు 45 నిమిషాల పాటు క్యూలో నిల్చోవాల్సి వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి నౌకలోని సాంకేతిక నిపుణులు రోజుకు 19 గంటలు పనిచేస్తున్నా లాభం లేకుండా పోతోంది. అయితే టాయిలెట్ సమస్యలు తలెత్తడం ఇదే మొదటిసారి కాదని.. గతేడాది మార్చిలోనూ నాలుగు రోజుల్లో నౌకలోని 205 టాయిలెట్లు పాడయ్యాయని సిబ్బంది తెలిపారు. ఇందులో అన్ని రకాల అత్యాధునిక సౌకర్యాలు ఉన్నప్పటికీ.. పెళుసుగా ఉండే వాక్యూమ్ ఆధారిత మురుగునీటి వ్యవస్థపై ఆధారపడడం వల్ల ఈ ఇబ్బందులు తలెత్తుతున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఇరుకైన మురుగు వ్యవస్థ నిర్మాణం కారణంగా ఒక వాల్వ్‌లో వైఫల్యం తలెత్తినా అన్ని టాయిలెట్లపై ఆ ప్రభావం పడుతోందన్నారు. ఈ పైపులను పునరుద్ధరించడానికి ప్రతిసారీ యాసిడ్ ఫ్లష్ చేయాల్సి వస్తోందన్నారు. దీని కోసం దాదాపు రూ.3 కోట్లను ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. అమెరికా ప్రభుత్వం తన కార్యక్రమాలను తరచూ పొడిగిస్తున్న కారణంగా కొంతమంది సిబ్బంది తీవ్ర అసహనానికి గురై సైన్యం వదిలి వెళ్లిపోవాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇటీవల అమెరికా వెనెజువెలాపై దాడి చేసి, మదురోను బంధించిన సమయంలోనూ ఈ నౌక నుంచే యుద్ధ విమానాలు దాడిలో పాల్గొన్నట్లు పలు నివేదికలు వెల్లడించాయి.




## ల్యాండింగ్‌కి ముందు.. సముద్రంలో పడిన హెలికాప్టర్..!

మరికాసేపట్లో ల్యాండ్ అవుతుందనగా.. ఓ హెలికాప్టర్ (Helicopter) సముద్రంలో పడిపోయింది. మంగళవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో హెలికాప్టర్‌లో ఉన్న ఏడుగురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడినట్లు అధికారులు తెలిపారు. అండమాన్‌లోని పోర్ట్ బ్లెయిర్ నుంచి ఇద్దరు సిబ్బంది సహా ఐదుగురు ప్రయాణికులతో పవన్ హాన్స్ హెలికాప్టర్ బయలుదేరింది. 9:30 గంటలకు అది సముద్రంలో పడిపోయిందని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. హెలికాప్టర్‌లో ఉన్న మొత్తం ఏడుగురిని రక్షించామని.. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొన్నారు. మాయా బందర్‌లో ల్యాండ్ కావాల్సి ఉండగా.. రన్‌వేకి దాదాపు 300 మీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తిందని.. దీంతో పైలట్ సముద్రంలో క్రాష్ ల్యాండింగ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పౌర విమానయాన అధికారి వెల్లడించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

కార్నీ భారత పర్యటనకు ముందు..

## తహవ్వుర్ రాణా పౌరసత్వం రద్దుకు కెనడా చర్యలు



కెనడా ప్రధాని మార్క్ కార్నీ భారత పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆ దేశ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముంబయి ఉగ్రదాడి కేసులో ప్రధాన సూత్రధారి తహవ్వుర్ హుస్సేన్ రాణాకు కెనడాలో ఉన్న పౌరసత్వాన్ని రద్దు చేయడానికి చర్యలు చేపట్టింది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. తహవ్వుర్ ప్రస్తుతం భారత్‌లో ఎన్ఐఏ అధికారుల కస్టడీలో ఉన్న సంగతి తెలిసిందే. 1997లో తహవ్వుర్ కెనడాకు వలస వెళ్లాడు. 2001లో ఇమిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజెన్‌షిప్ కెనడా అతడికి కెనడా పౌరసత్వం ఇచ్చింది. అయితే, ఇప్పుడీ పౌరసత్వాన్ని రద్దు చేసేందుకు ఐఆర్‌సీసీ చర్యలు ప్రారంభించింది. దీనికి కారణం అతడిపై ఉన్న ఉగ్ర ఆరోపణలు కాదని.. తప్పుడు పత్రాలతో పౌరసత్వం పొందాడన్న ఆరోపణలతో ఈ చర్యలు చేపట్టామని ఐఆర్‌సీసీ వివరించింది. పౌరసత్వం కోసం రాణా దరఖాస్తు చేసుకున్న సమయంలో తాను టొరంటో నివాసినని పేర్కొన్నాడు. కానీ, ఆ సమయంలో అతడు షికాగోలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీనిపై కొన్నేళ్లుగా దర్యాప్తు జరుగుతోంది. ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొన్నాడన్న ఆరోపణలపై తహవ్వుర్ 2009లో అరెస్టయ్యాడు. అమెరికా జైల్లో శిక్ష అనుభవించిన అతడిని యూఎస్ అధికారులు గతేడాది భారత్‌కు అప్పగించారు.

* **కెనడా ప్రధాని భారత పర్యటన..**

కెనడా ప్రధాని మార్క్ కార్నీ (Mark Car ney) తన మూడు దేశాల పర్యటనలో భాగంగా ఫిబ్రవరి 26న భారత్‌కు రానున్నారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక, దౌత్య సంబంధాల పునరుద్ధరణకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఎదురు చూస్తోందని కెనడా ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొంది. భారత పర్యటన అనంతరం కార్నీ ఆస్ట్రేలియా, జపాన్‌కు వెళ్లనున్నారు. కెనడా ప్రధాని భారత పర్యటనపై ఆ దేశంలోని ఫోరం ఆఫ్ ఫెడరేషన్స్ సీఈవో రూపక్ ఛటోపాధ్యాయ మాట్లాడుతూ.. భారత్, కెనడా మధ్య రాజకీయ, వ్యవస్థీకృత సారూప్యతలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇరుదేశాలు కలిసి పని చేయడం వల్ల భవిష్యత్తులో అనేక పరస్పర ప్రయోజనాలు పొందే అవకాశం ఉందన్నారు.

## ఉద్యోగులకు సీఎంఓ సందేశాలు పంపొద్దు

## కేరళ హైకోర్టు ఆదేశాలు

కేరళ ప్రభుత్వానికి ఆ రాష్ట్ర హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది . రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వ్యక్తిగత డేటాను సీఎం కార్యాలయం అనధికారికంగా యాక్సెస్ చేస్తోందని, ప్రమోషనల్ మెసేజ్‌ల కోసం దానిని వినియోగిస్తోందన్న ఆరోపణలపై వెంటనే వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఇలాంటి సందర్భాల్లో గోప్యతా హక్కు ఉల్లంఘనకు గురయ్యే అవకాశం ఉందని న్యాయస్థానం ఆందోళన వ్యక్తంచేసింది. రాష్ట్రానికి చెందిన 77 లక్షల మంది ఫోన్ నంబర్లు, వ్యక్తిగత వివరాలను వారి అనుమతి లేకుండా సేకరించారంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఆ 77 లక్షల మందిలో 5.42 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు. 62 లక్షల మంది ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద పింఛను పొందుతున్నవారు కాగా.. మరో 10 లక్షల మంది మహిళా భద్రతా పథకాల లబ్ధిదారులు. వాట్సప్ సందేశాల్లో ప్రభుత్వ విజయాలను ప్రచారం చేసుకునేందుకు సీఎంఓ సోషల్ మీడియా బృందం ఈ డేటాను వాడినట్లు పిటిషనర్లు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సిబ్బందికి సందేశాలు పంపకుండా సీఎంఓపై హైకోర్టు ఆంక్షలు విధించింది.




## ఆస్ట్రేలియా ప్రధాని నివాసానికి బాంబు బెదిరింపు

ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ కాన్‌బెర్రాలోని అధికారిక నివాసానికి (The Lodge) బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన భద్రతా దళాలు.. కొన్ని గంటల పాటు ఆయన్ను సురక్షిత ప్రాంతానికి తరలించాయి. భవనంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించామని, అక్కడ అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదని ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతానికి ప్రజల భద్రతకు ఎటువంటి ముప్పు లేదని పేర్కొన్నారు. కాన్‌బెర్రా అధికారిక నివాసం ది లాడ్జ్‌లో మంగళవారం సాయంత్రం ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ఉన్న సమయంలోనే బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో సాయంత్రం 6 గంటలకు ఆయన్ను సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లిన భద్రతా సిబ్బంది.. తనిఖీలు పూర్తిచేసిన తర్వాత 9గంటలకు తిరిగి ఆ భవనానికి తీసుకువచ్చారు.



## ఏఐ సదస్సులో ఆందోళన.. దిల్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరెస్ట్



దిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్ (AI Summit)లో యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి నిరసనలు తెలపడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ ఘటనకు సంబంధించి దిల్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ (Youth Con gress chief Uday Bhanu Chib) ను పోలీసులు తాజాగా అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య ఎనిమిదికి చేరింది. నిరసనల గురించి ఉదయ్ భానును పోలీసులు దాదాపు 20 గంటలపాటు విచారించారని అధికార వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత ఆయన్ను అరెస్టు చేసినట్లు వెల్లడించాయి. నిరసనలకు సంబంధించిన ప్రణాళికల్లో ఆయన కీలక పాత్ర పోషించారని ఆధారాలు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ అనంతరం అతడిని దిల్లీ పాటియాలా హౌస్ కోర్టులో హాజరుపరిచారు. నిరసనలకు సూత్రధారిగా పేర్కొంటూ.. ఏడు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఈ నిరసనల్లో పాల్గొన్నారని వెల్లడించారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. యూత్ కాంగ్రెస్ నేతకు నాలుగు రోజుల కస్టడీ విధించింది.

# రామ్మోహన్‌తో కిషన్‌రెడ్డి భేటీ.. విమానాశ్రయాల నిర్మాణంపై చర్చ



హైదరాబాద్: పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి భేటీ అయ్యారు. తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధి, వివిధ ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు. వరంగల్, ఆదిలాబాద్, పెద్దపల్లిలో విమానాశ్రయ ప్రాజెక్టులు, రాష్ట్రంలో ప్రతిపాదిత, పనులు జరుగుతున్న విమానాశ్రయ ప్రాజెక్టులపై చర్చించారు. ప్రాజెక్టుల పూర్తికి తీసుకోవాల్సిన చర్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంపై మంత్రులు సమీక్షించారు. పరిపాలన, సాంకేతిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వరంగల్ విమానాశ్రయం కోసం 9,533 ఎకరాలు అందుబాటులోకి వచ్చిందని అధికారులు వివరించారు. 2,500 మీటర్ల రన్‌వే నిర్మించనున్నట్లు తెలిపారు. డిజైన్, స్కోప్ ఆఫ్ వర్క్, డీపీఆర్ ఖరారు ప్రక్రియ తుదిదశలో ఉందని అధికారులు మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. జూన్‌లో శంకుస్థాపనకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి భూసేకరణ ఇంకా ప్రారంభం కాలేదని, రన్‌వేకు రక్షణశాఖ భూములు వినియోగించనున్నామని తెలిపారు. విమానయాన, రక్షణ శాఖలు విధివిధానాలు ఖరారు చేస్తాయన్నారు. పెద్దపల్లిలో విమానాశ్రయం నిర్మాణానికి 980 ఎకరాలు గుర్తించామని, దీనికి సంబంధించి ఫీజిబిలిటీ స్టడీ జరుగుతోందని ఏఏఐ ఛైర్మన్ వివరించారు.

## హాల్ టికెట్ ఉంటే..
# కోరిన చోట బస్సు ఆపండి

**: పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్: పరీక్షలు జరిగే రోజుల్లో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ హాల్ టికెట్లు చూపిస్తే కోరిన చోట బస్సు ఆపేలా వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు, మార్చి 14వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరగనుండటంతో.. పరీక్షల సమయంలో అదనంగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకున్నట్టు ఆర్టీసీ అధికారులు వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు బస్సుల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం అధికారులను ఆదేశించారు. పరీక్షల సమయంలో స్టాప్ లేకున్నా.. కోరిన చోట బస్సులు ఆపి విద్యార్థులను దింపేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

# హైదరాబాద్‌లో అకాల వర్షం... నగరానికి ఆరెంజ్ అలర్ట్

- **హైదరాబాద్‌లో పలుచోట్ల కురిసిన వర్షం**
- **మియాపూర్, చందానగర్ ప్రాంతాల్లో స్తంభించిన ట్రాఫిక్**
- **హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ**
- **అల్పపీడనం ప్రభావంతో మరో రెండు రోజులు వానలు**
- **ఉరుములు, ఈదురుగాలులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక**



హైదరాబాద్ నగరంలో మంగళవారం అకాల వర్షం ముంచెత్తింది. గత రెండు రోజులుగా ఉక్కపోతతో అల్లాడిన నగరవాసులకు ఈ వర్షం ఉపశమనం కలిగించినప్పటికీ, పలుచోట్ల జనజీవనానికి అంతరాయం కలిగించింది. ముఖ్యంగా మియాపూర్, చందానగర్, కొండాపూర్, మదీనాగూడ, లింగంపల్లి వంటి ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. గంగారం నుంచి మియాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై వర్షపు నీరు చేరడంతో వాహనాలు నిలిచిపోయి తీవ్రమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని, గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద, పాత భవనాల వద్ద నిలబడవద్దని సూచించింది. ఈ అకాల వర్షాలు రైతులపై మిశ్రమ ప్రభావం చూపుతున్నాయి. కొన్ని ఆరుతడి పంటలకు ఈ వానలు మేలు చేస్తుండగా, ఈదురుగాలులు, వడగళ్ల కారణంగా చేతికొచ్చిన వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో అలర్ట్ జారీ చేసింది.



## ఉపాధి హామీ పథకం..
## యధాతథంగా కొనసాగింపుపై మండలి ఏకగ్రీవ తీర్మానం

గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమం, సామాజిక ఆస్తుల సృష్టి, మౌలిక వసతుల అభివృద్ధిలో ఉపాధి హామీ పథకం మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఎర్రమంజిల్లోని మిషన్ భగీరథ కార్యాలయంలో మంత్రి సీతక్క అధ్యక్షతన మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్మెంట్ గ్యారెంటీ యాక్ట్ (ఎంజీఎన్ఆర్ఇజీఏ) 9వ రాష్ట్ర ఉపాధి హామీ మండలి సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రతిపాదిస్తున్న వీబీజీ రాంజీ విధానం అమల్లోకి వస్తే కూలీలు నష్టపోయే ప్రమాదం ఉందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. కూలీలకు ఉపాధి హక్కుగా లభించే ఎంజీఎన్ఆర్ఇజీఏ చట్టాన్ని యధాతథంగా కొనసాగించాలని మండలి ఏకగ్రీవంగా తీర్మానించింది.




# హైదరాబాదులో ఇద్దరు ఘరానా దొంగల అరెస్ట్

- **కోఠి ఏటీఎంలో వ్యాపారిపై కాల్పుల కేసులో ఇద్దరి అరెస్ట్**
- **నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన అంతరాష్ట్ర ముఠాగా గుర్తింపు**
- **వారి నుంచి తుపాకీ, 35 బుల్లెట్లు, రూ. 2.38 లక్షల నగదు స్వాధీనం**
- **క్యాబ్ డ్రైవర్ పక్కా ప్లాన్‌తోనే ఈ దోపిడీ జరిగినట్టు వెల్లడి**
- **పరారీలో ఉన్న మరో ఐదుగురి కోసం పోలీసుల గాలింపు**

హైదరాబాద్ నగరం నడిబొడ్డున తీవ్ర కలకలం రేపిన కోఠి కాల్పుల దోపిడీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. జనవరి 31న ఎస్‌బీఐ ఏటీఎం వద్ద వ్యాపారిపై కాల్పులు జరిపి రూ. 6 లక్షలు దోచుకున్న అంతరాష్ట్ర ముఠాలోని ఇద్దరు సభ్యులను అరెస్ట్ చేసినట్టు టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మంగళవారం వెల్లడించారు. నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందినవారని తెలిపారు. అరెస్టయిన వారిని యూపీకి చెందిన ఫుర్ఖాన్ అహ్మద్ (36), తయ్యబ్ త్యాగి (30)గా గుర్తించారు. తయ్యబ్ త్యాగి నగరంలో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తూ షాహీన్ నగర్‌లో నివసిస్తున్నాడు. వారి నుంచి ఒక దేశీయ తుపాకీ, 35 బుల్లెట్లు, రెండు మ్యాగజైన్లు, రూ. 2.38 లక్షల నగదు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు డీసీపీ తెలిపారు. ఈ కేసులో ఫహీమ్ అహ్మద్, నౌషాద్, అబిద్, డానిష్ త్యాగి, మహ్మద్ మత్లుబ్ అనే మరో ఐదుగురు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని చెప్పారు.

### క్యాబ్ డ్రైవరే సూత్రధారి

క్యాబ్ డ్రైవర్ తయ్యబ్ త్యాగి ఈ దోపిడీకి ప్రధాన సూత్రధారి అని పోలీసులు తెలిపారు. తెల్లవారుజామున ట్రిప్పులకు వెళ్లినప్పుడు కోఠి, అబిడ్స్, నాంపల్లి ప్రాంతాల్లోని ఏటీఎంలలో కొందరు పెద్ద మొత్తంలో డబ్బు డిపాజిట్ చేయడాన్ని గమనించాడు. దోపిడీకి పథకం పన్ని, తన బంధువులైన నౌషాద్, డానిష్ త్యాగిలకు చెప్పాడు. వారు యూపీకి చెందిన ఫుర్ఖాన్, అబిద్, ఫహీమ్‌లను ఈ ప్లాన్‌లో చేర్చారు. జనవరి 31న ఉదయం, పథకం ప్రకారం ఫుర్ఖాన్, ఫహీమ్ కోటిలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద వేచి ఉన్నారు. వ్యాపారి లోపలికి వెళ్లగానే, వారు కూడా వెళ్లి తుపాకీతో బెదిరించి డబ్బు డిమాండ్ చేశారు. బాధితుడు ప్రతిఘటించడంతో ఫుర్ఖాన్ మొదట నేలపై, తర్వాత అతని కాలిపై కాల్పులు జరిపి, డబ్బు సంచితో పాటు అతని టూవీలర్‌ను తీసుకుని పరారయ్యారు. ఈ కేసును ఛేదించేందుకు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు, పక్కా సమాచారంతో మంగళవారం షాహీన్ నగర్ వద్ద ఇద్దరిని అరెస్ట్ చేశారు.




# మాదాపూర్‌లో రూ.300 కోట్ల స్థలం కాపాడిన హైడ్రా

నగరంలో అక్రమార్కుల చేతుల్లో కబ్జాకు గురవుతున్న పార్కులు, ఓపెన్ ప్లేస్‌లు, కామన్ ల్యాండ్‌ను రక్షించేందుకు హైడ్రా (HYDRA) ఉక్కుపాదం మోపుతోంది. ఈ క్రమంలో తాజాగా మాదాపూర్ పరిధిలోని కాకతీయ హిల్స్‌లో సుమారు రూ.300 కోట్ల విలువైన 4,090 చదరపు గజాల పార్కు స్థలంతో పాటు ఇతర కామన్ ల్యాండ్‌ను హైడ్రా కాపాడింది. నకిలీ పత్రాలతో ఈ భూములను కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నించడంతో, స్థానిక అసోసియేషన్ హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు, సంబంధిత రెవెన్యూ రికార్డులను పరిశీలించి, అక్రమ కబ్జాలపై చర్యలు చేపట్టారు. కబ్జాకు గురయ్యే ప్రమాదంలో ఉన్న స్థలాలకు కంచె ఏర్పాటు చేసి రక్షణ కల్పించారు. 1979 నాటి లేఅవుట్ నిబంధనల ప్రకారం ఈ బహిరంగ ప్రదేశాలు ప్రజావసరాల కోసం కేటాయించినవని అధికారులు స్పష్టం చేశారు. ఈ చర్యలతో స్థానికులు హైడ్రా అధికారులను అభినందిస్తూ, భవిష్యత్తులోనూ ఇలాంటి అక్రమాలపై కఠిన చర్యలు కొనసాగించాలని కోరుతున్నారు.

# అంబర్‌పేట్‌లో విషాదం.. ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య

- **ఉరి వేసుకుని భార్యాభర్త, మణికట్టు కోసుకుని కొడుకు బలవన్మరణం**
- **హోటల్ నిర్వహణలో నష్టాలతో అప్పులపాలైన యజమాని**
- **ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యలకు కారణమని పోలీసుల అనుమానం**



అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఆర్థిక ఇబ్బందులే ఈ ఘోర నిర్ణయానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. మృతులను రామరాజు (55), ఆయన భార్య మాధవి (50), మరియు కుమారుడు శశాంక్ (24)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. రామరాజు స్థానికంగా హోటల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా వ్యాపారంలో నష్టాలు రావడంతో రామరాజు అప్పుల పాలయ్యారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం రామరాజు ఇంటి తలుపులు తెరుచుకోకపోవడంతో చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు.. తలుపులు తెరిపించి చూడగా లోపల ముగ్గురూ విగతజీవులుగా కనిపించారు. రామరాజు, మాధవి ఉరివేసుకుని ప్రాణాలు తీసుకోగా, శశాంక్ తన మణికట్టు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పుల భారం పెరిగిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై కుటుంబమంతా ఈ విపరీత నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు.. కేసు నమోదు చేసి ఆర్థిక లావాదేవీల కోణంలో విచారణ జరుపుతున్నారు.

## ఉద్యోగులకు కొత్త రూల్.. లంచ్ బ్రేక్ అరగంటే..



హైదరాబాద్ విద్యుత్ సౌధలో పని చేస్తున్న ఉద్యోగులకు కొత్త రూల్స్ పెడుతూ ట్రాన్స్కో ఎండీ కృష్ణభాస్కర్ ఉత్తర్వులు ఇచ్చారు. మధ్యాహ్నం 1 గంటల నుంచి 3 గంటల మధ్య ఎప్పుడైనా అరగంట మాత్రమే లంచ్ బ్రేక్ ఉంటుందని తెలిపారు. డ్యూటీ సమయంలో వాకింగ్, ముచ్చట్లు పెట్టడం కుదరదని స్పష్టం చేశారు. ఎమర్జెన్సీ, ముఖ్యమైన కాల్స్ మాత్రమే మొబైల్ ఫోన్ వాడాలని పేర్కొన్నారు. డ్యూటీ సమయాల్లో కచ్చితంగా సీట్లలో అందుబాటులో ఉండాల్సిందేనని తేల్చి చెప్పారు. ఆఫీసు సమయంలో కచ్చితంగా విధుల్లో ఉండాలని సూచించారు. ఆఫీసు సమయంలో వాకింగ్ చేయడం, ముచ్చట్లు పెట్టడం కుదరని తేల్చిచెప్పారు. ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, అమలు చేసే బాధ్యతలను హెచ్‌ఓడీలు తీసుకోవాలని, కొత్త రూల్స్ పాటించకపోతే కఠిన చర్యలు తీసుకోనున్నట్టు ఎండీ కృష్ణభాస్కర్ హెచ్చరించారు.

# ఆర్టీసీ ప్రయాణికుల కోసం కొత్త యాప్

తెలంగాణ : టీజీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సౌలభ్యం కోసం మీసేవ మీ టికెట్ మొబైల్ యాప్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రయాణీకులు సుదూర ప్రయాణాలు, ఇంటర్‌సిటీ బస్సు టిక్కెట్లను డిజిటల్‌గా బుక్ చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. మంగళవారం సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , రవాణా శాఖ స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్ , ఎండీ నాగిరెడ్డి , మీసేవ కమీషనర్ రవికిరణ్ తో కలిసి మీ మొబైల్ ఆప్ ను ఆవిష్కరించారు. ఈ సరికొత్త విధానం ద్వారా మీ టికెట్ మొబైల్ యాప్ ఓపీఆర్ ఎస్‌సేవలను కూడా అనుసంధానిస్తుంది. యాప్ ద్వారా 1710 ఓపీఆర్ఎస్‌సేవలు, ఏసీ సేవలు 450, నాన్ ఏసీ సేవలు: 1,260, రోజువారీగా బుకింగ్ అయ్యే సీట్లు 13 వేలు బుకింగ్‌చేసుకోవచ్చు. బెంగళూరు, తిరుపతి, విశాఖ పట్నం, విజయవాడ, మంచిర్యాల, ఖమ్మం, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, వరంగల్ జిల్లాలకు సౌకర్యం కల్పించారు. గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో ఐదు రకాల బస్ పాస్‌లు పొందే సౌకర్యం అమలు చేశారు. టికెట్ మొబైల్ యాప్ ద్వారా ఇప్పుడు ఐదు కేటగిరీల సిటీ బస్ పాస్‌లు డిజిటల్‌గా అందుబాటులో ఉన్నాయి. ఆర్టీసీ బస్ పాస్ మాడ్యూల్ హైదరాబాద్ నగరంలోని ప్రయాణీకులకు మొబైల్ యాప్ ద్వారా నెలవారీ బస్ పాస్‌లను డిజిటల్‌గా తీసుకోవడానికి, పునరుద్ధరించడానికి వీలు కల్పిస్తుంది.

## మార్కెట్లపై ట్రంప్ దెబ్బ...

**కుప్పకూలిన సెన్సెక్స్**

**భారీ నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు**

**అమెరికా వాణిజ్య విధానాలపై ఆందోళనలతో అమ్మకాల ఒత్తిడి**

**1068 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, 288 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ**

**రెండేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన ఐటీ రంగ షేర్లు**

**మార్కెట్లలో మరికొంత కాలం అస్థిరత కొనసాగే అవకాశం**




**ముంబై:** అమెరికా వాణిజ్య విధానాలపై తాజాగా తలెత్తిన ఆందోళనలతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలను చవిచూశాయి. గత నాలుగు రోజుల్లో ఎన్నడూ లేనంతగా అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు కుప్పకూలాయి. బ్యాంకింగ్, ఇన్‌ఫ్రా, ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాలు జరగడంతో సెన్సెక్స్ 1,068.74 పాయింట్లు నష్టపోయి 82,225.92 వద్ద ముగిసింది. నిఫ్టీ 288.35 పాయింట్లు తగ్గి 25,424.65 వద్ద స్థిరపడింది.


అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్తగా 15 శాతం తాత్కాలిక టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించడంతో ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య ఉద్రిక్తతలు మళ్లీ రాజుకుంటాయన్న భయాలు మొదలయ్యాయి. గతంలో ఆయన విధించిన టారిఫ్‌లు చట్టవిరుద్ధమని అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, ట్రంప్ తాజా హెచ్చరికలు చేయడంతో అంతర్జాతీయ మార్కెట్ల సెంటిమెంట్ దెబ్బతింది. దీని ప్రభావం భారత మార్కెట్లపై కూడా ప్రతికూలంగా పడింది.

ఈ అమ్మకాల ఒత్తిడిలో ఐటీ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. అమెరికా టెక్నాలజీ వ్యయంపై ఆందోళనలు, బలహీనమైన గ్లోబల్ సంకేతాలతో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 4.74 శాతం పతనమై 30,053.50 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో ఈ సూచీ రెండేళ్ల కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. ఐటీ తర్వాత రియాల్టీ రంగం 2.54 శాతం నష్టపోయింది. అయితే, మెటల్ ఇండెక్స్ మాత్రం మార్కెట్ పతనంలోనూ కాస్త మెరుగ్గా నిలిచింది.

విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి 25,500--25,600 స్థాయి కీలక నిరోధకంగా ఉంది. దీనిపైన నిలదొక్కుకుంటేనే మార్కెట్ పుంజుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ 25,300 స్థాయికి దిగువకు పడిపోతే, అమ్మకాల ఒత్తిడి మరింత పెరగవచ్చని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, ఏఐ టెక్నాలజీపై ఆందోళనల కారణంగా మార్కెట్లు సమీప భవిష్యత్తులో అస్థిరంగానే కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## 24వేల నకిలీ అకౌంట్లతో చైనా సంస్థల చోరీ..

**ఆంథ్రోపిక్ సంచలన ఆరోపణలు**



**న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ఏఐ రేసు కనిపిస్తోంది. అది రాజకీయ భౌగోళిక వివాదాలకు దారితీస్తోంది. అమెరికా ఏఐ స్టార్టప్ ఆంథ్రోపిక్ మూడు చైనా కంపెనీలపై తీవ్ర ఆరోపణలు చేయడమే ఇందుకు కారణం. తమ క్లాడ్ మోడళ్ల సామర్థ్యాలను డీప్‌సీక్, మూన్‌షాట్ ఏఐ, మినిమ్యాక్స్ చోరీ చేస్తున్నాయని ఆంథ్రోపిక్ ఆరోపించింది.

ఈ మూడు చైనా ల్యాబ్స్ 24వేల నకిలీ అకౌంట్లను వినియోగించి, క్లాడ్‌తో 16 మిలియన్ ఇంటరాక్షన్లను సృష్టించాయని ఆంథ్రోపిక్ పేర్కొంది. నిబంధనలను ఉల్లంఘిస్తూ డిస్టిలేషన్‌కు పాల్పడుతోందని ఆరోపించింది. ఙఇఅర్ఙఅశ్రీశ్రీఫ్ఙఅశీఅ అనేది ఒక ట్రైనింగ్ టెక్నిక్. ఒక సమర్థవంతమైన ఏఐ మోడల్ ఇచ్చే అవుట్‌పుట్ నుంచి అంతగా సామర్థ్యంలేని ఒక చిన్న మోడల్ నేర్చుకునే ప్రక్రియ. చట్టబద్ధమైన ప్రయోజనాలకోసం ఏఐ రంగంలో ఈ డిస్టిలేషన్‌ను వినియోగిస్తున్నారు. దీంతో కంపెనీల్లోనే అంతర్గతంగా చిన్న, చౌకైన వెర్షన్లను క్రియేట్ చేసుకోవడమనేది సాధారణ ప్రక్రియే. ఈ టెక్నిక్‌ను పోటీదారులు దుర్వినియోగం చేస్తున్నాయని ఆంథ్రోపిక్ చెప్తోంది.

పోటీ సంస్థలు పెద్దగా సమయం వెచ్చించకుండానే.. స్వల్ప మొత్తంతో అధునాతన సామర్థ్యాలను కాపీ చేస్తున్నాయని ఆరోపిస్తోంది. ఇలా కాపీ చేసే చిన్న చిన్న ఏఐ మోడల్స్.. సాంకేతికతను దుర్వినియోగం చేయకుండా నిరోధించే రక్షణ వ్యవస్థలను కలిగి ఉండబోవని వినియోగదారులను హెచ్చరించింది. కోడింగ్, ఏజెంటిక్ రీజనింగ్, టూల్ యూజ్, కంప్యూటర్ యూజ్ ఏజెంట్స్, కంప్యూటర్ వెర్షన్ వంటి సామర్థ్యాలను మెరుగుపర్చుకునేందుకు చైనా సంస్థలు ఈ ఇంటరాక్షన్ జరిపాయని అమెరికా స్టార్టప్ పేర్కొంది. ఈ తరహా ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేసేందుకు డిటెక్షన్ సిస్టమ్‌ను మరింత విస్తరిస్తామని వెల్లడించింది.

మరోవైపు, ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్‌కు అమెరికా రక్షణ శాఖ కేంద్రకార్యాలయం పెంటగాన్ సమన్లు ఇచ్చింది. రక్షణమంత్రి పీట్ హెగ్సెత్‌తో సమావేశమయ్యేందుకు పిలిచింది. ఈ స్టార్టప్ కొత్త ఫీచర్లలో మిలిటరీకి సంబంధించినవి కూడా ఉన్నాయి. మిలిటరీ క్లాసిఫైడ్ సిస్టమ్స్ (సున్నితమైన డేటాను నిర్వహిస్తుంది)లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏకైక మోడల్ ఇది. సున్నితమైన నిఘా, రక్షణ కోసం ఉపయోగించవచ్చు. చట్టబద్ధమైన ఉపయోగాల కోసం ఏఐ మోడళ్లను ఆంథ్రోపిక్ అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. అమెరికా జాతీయ భద్రతకు మద్దతుగా తాము ఏఐ సేవలు అందించడానికి సిద్ధంగా ఉంటామని చెబుతూనే.. వినియోగ పరిమితులను సడలించడానికి మాత్రం ఆంథ్రోపిక్ అంగీకరించడం లేదు. ఈ నేపథ్యంలోనే తాజా సమన్లు అందాయి.

## బ్యాంకులు మిస్-సెల్లింగ్‌కు దూరంగా ఉండాలి

**ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**



**న్యూఢిల్లీ:** వినియోగదారులకు బీమా వంటి ఆర్థిక ఉత్పత్తులను తప్పుడు వివరాలతో బ్యాంకుల్లోనే విక్రయించడం (మిస్-సెల్లింగ్)పై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బ్యాంకులు తమ ప్రధాన వ్యాపారంపై దృష్టి పెట్టాలి. అవసరం లేకపోయినా బీమా ఉత్పత్తులు విక్రయించడానికే బ్యాంకులు ఎక్కువ సమయం కేటాయిస్తున్నాయి. బ్యాంకుల నియంత్రణ సంస్థ ఆర్‌బీఐ, బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ మధ్య ఉన్న నిర్వహణ పరమైన దూరం వల్ల ఎవరికీ జవాబుదారీతనం లేకుండా పోయింది' అని పేర్కొన్నారు. బడ్జెట్ తర్వాత నిర్వహించిన రిజర్వ్‌బ్యాంక్ (ఆర్‌బీఐ) సెంట్రల్ బోర్డ్ సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి విలేకరులతో మాట్లాడారు. మిస్-సెల్లింగ్‌ను ఉపేక్షించేది లేదంటూ ఆర్‌బీఐ ఇచ్చిన ముసాయిదా మార్గదర్శకాలపై సంతోషంగా ఉందన్నారు. 'ఇకపై ఇలాంటి పనులు చేయలేరు అనే సందేశం బ్యాంకులకు వెళ్లాలి' అని మంత్రి పేర్కొన్నారు. బ్యాంకులు డిపాజిట్లు, రుణాలపైనే దృష్టి సారించాలని ఆమె సూచించారు. గృహరుణం తీసుకునేందుకు ఇల్లు/స్థలం తాకట్టు పెడుతుండగా, మళ్లీ బీమా తీసుకోమని బ్యాంకులు ఒత్తిడి చేస్తుండటాన్ని మంత్రి ప్రశ్నించారు.

ప్రభుత్వరంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల విలీనం కోసం ప్రభుత్వం వద్ద ప్రస్తుతానికి ప్రణాళికేమీ లేదని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. వికసిత్ భారత్ కోసం బ్యాంకింగ్‌పై నియమించిన ఉన్నతస్థాయి కమిటీ నివేదిక ఇచ్చాక, ఈ రంగాన్ని మరింత పటిష్ఠం చేసే చర్యలు తీసుకుంటామని వివరించారు.

# మహిళల టీ20 ప్రపంచకప్ 2026

# షెడ్యూల్ విడుదల...



**భారత్ తొలి పోరు పాక్‌తో!**

**మహిళల టీ20 ప్రపంచకప్ 2026 పూర్తి షెడ్యూల్‌ను ప్రకటించిన ఐసీసీ**

**ఇంగ్లండ్ వేదికగా జూన్ 12 నుంచి జులై 5 వరకు టోర్నీ**

**జూన్ 14న పాకిస్థాన్‌తో తన తొలి మ్యాచ్ ఆడనున్న భారత జట్టు**

**గ్రూప్-ఏలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్‌లతో పాటు భారత్**

**ఇప్పటివరకు ఒక్కసారి కూడా టీ20 టైటిల్ గెలవని టీమిండియా**

**న్యూఢిల్లీ:** క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026 పూర్తి షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మంగళవారం విడుదల చేసింది. ఇంగ్లండ్ వేదికగా జరగనున్న ఈ మెగా టోర్నీ జూన్ 12న ఆతిథ్య ఇంగ్లండ్, శ్రీలంక జట్ల మధ్య జరిగే మ్యాచ్‌తో ప్రారంభం కానుంది. క్రికెట్ మక్కాగా భావించే ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో జులై 5న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నీలో భాగంగా భారత జట్టు తన తొలి మ్యాచ్‌ను చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జూన్ 14న ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఆడనుంది.

ఇటీవల నేపాల్‌లో ముగిసిన క్వాలిఫయర్ టోర్నీ ద్వారా బంగ్లాదేశ్, ఐర్లాండ్, స్కాట్లాండ్, నెదర్లాండ్స్ జట్లు ప్రపంచకప్‌కు అర్హత సాధించాయి. దీంతో టోర్నీలో పాల్గొనే 12 జట్ల లైనప్ ఖరారైంది. ఈ టోర్నీలో మొత్తం 12 జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. భారత జట్టును ఆరుసార్లు ఛాంపియన్ ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్‌తో కూడిన కఠినమైన గ్రూప్-ఏలో చేర్చారు. ఇక గ్రూప్-బిలో వెస్టిండీస్, ఇంగ్లండ్, డిఫెండింగ్ ఛాంపియన్ న్యూజిలాండ్, శ్రీలంక, ఐర్లాండ్, స్కాట్లాండ్ జట్లు ఉన్నాయి.

**భారత జట్టు తమ గ్రూప్ దశ మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా ఉంది:**

జూన్ 14: పాకిస్థాన్‌తో తొలి మ్యాచ్
జూన్ 16: నెదర్లాండ్స్‌తో రెండో మ్యాచ్
జూన్ 21: దక్షిణాఫ్రికాతో మూడో మ్యాచ్
జూన్ 25: బంగ్లాదేశ్‌తో నాలుగో మ్యాచ్
జూన్ 28: ఆస్ట్రేలియాతో చివరి గ్రూప్ మ్యాచ్

షెడ్యూల్ విడుదల సందర్భంగా ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా మాట్లాడుతూ, "మహిళల టీ20 ప్రపంచకప్ 2026 షెడ్యూల్ విడుదల చేయడం ఈ మెగా ఈవెంట్ సన్నాహాల్లో ఒక ముఖ్యమైన మైలురాయి. మహిళల క్రికెట్‌లో ఐసీసీ నిరంతర పెట్టుబడులకు ఇది కొనసాగింపు. ప్రపంచవ్యాప్తంగా అభిమానుల నుంచి మరింత ఆదరణ, గుర్తింపు పొందడమే మా లక్ష్యం. గతంలో భారత్‌లో జరిగిన మహిళల ప్రపంచకప్ ఈ క్రీడకు కొత్త ఊపునిచ్చింది. ఆ జోరును ఈ టోర్నీతో కూడా కొనసాగించాలని ఆశిస్తున్నాం" అని తెలిపారు.

ఇప్పటివరకు జరిగిన తొమ్మిది ఎడిషన్లలో భారత మహిళల జట్టు ఒక్కసారి కూడా టీ20 ప్రపంచకప్ గెలవలేకపోయింది. నాలుగు సార్లు సెమీఫైనల్స్‌కు చేరినప్పటికీ, 2020లో ఫైనల్‌లో ఓటమిపాలైంది. ఈసారి ఎలాగైనా టైటిల్ గెలిచి తమ దశాబ్దాల నిరీక్షణకు తెరదించాలని భారత జట్టు పట్టుదలగా ఉంది.

## కింగ్ ఫామ్ గురించి ఆందోళన లేదు..

**విండీస్ కెప్టెన్ షాయ్ హోప్**

**టీ20 ప్రపంచకప్‌లో జింబాబ్వేపై వెస్టిండీస్ 107 పరుగుల తేడాతో గెలుపు**

**విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడిన హెట్మెయర్.. 34 బంతుల్లో 85 పరుగులు**

**స్పిన్నర్ గుడకేశ్ మోతీ ప్రదర్శనపై ప్రశంసలు కురిపించిన హోప్**



**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్ సూపర్-8 పోరులో వెస్టిండీస్ జట్టు భారీ విజయాన్ని నమోదు చేసింది. సోమవారం ముంబైలోని వాంఖడే స్టేడియంలో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో 107 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ గెలుపుతో మూడోసారి టైటిల్ గెలిచేందుకు తాము సిద్ధంగా ఉన్నామనే సంకేతాలు పంపింది. అయితే ఓపెనర్ బ్రాండన్ కింగ్ ఫామ్ జట్టును కొంత కలవరపెడుతోంది. ఈ మ్యాచ్‌లో అతడు 12 బంతుల్లో కేవలం 9 పరుగులే చేసి ఔటయ్యాడు.

ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన విండీస్, షిమ్రన్ హెట్మెయర్ (34 బంతుల్లో 85; 7 ఫోర్లు, 7 సిక్సలు) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 254 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇది ఈ టోర్నీలో అత్యధిక స్కోరు కాగా, టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే రెండో అతిపెద్ద స్కోరు. అనంతరం లక్ష్య ఛేదనలో జింబాబ్వే 17.4 ఓవర్లలో 147 పరుగులకే కుప్పకూలింది.

మ్యాచ్ అనంతరం విండీస్ కెప్టెన్ షాయ్ హోప్ మాట్లాడుతూ.. కింగ్ ఫామ్ గురించి పెద్దగా ఆందోళన చెందడం లేదని స్పష్టం చేశాడు. "కింగ్ ఫామ్ గురించి ఆందోళన లేదు. అతడు బాగానే బ్యాటింగ్ చేస్తున్నాడు. అతడి సామర్థ్యంపై నాకు పూర్తి నమ్మకం ఉంది" అని హోప్ అన్నాడు. హెట్మెయర్, రోవ్‌మన్ పావెల్ అద్భుతమైన భాగస్వామ్యం నెలకొల్పారని, వారిని చూస్తుంటే ఆనందంగా ఉందని చెప్పాడు.

అలాగే, స్పిన్నర్ గుడకేశ్ మోతీ (4/28) ప్రదర్శనపై హోప్ ప్రశంసలు కురిపించాడు. ఆటకు కొంతకాలం దూరంగా ఉండటం అతడికి మేలు చేసిందని, అద్భుతమైన బౌలింగ్‌తో జట్టుకు ఉపయోగపడ్డాడని కొనియాడాడు. విండీస్ తన తదుపరి మ్యాచ్‌లో కోల్‌కతా వేదికగా దక్షిణాఫ్రికాతో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంటుంది.

## తిలక్ తొందరపడకు..

**ఛేజ్‌మాస్టర్ అవ్వాలంటే కోహ్లీలా ఆడు..!**



**న్యూఢిల్లీ:** స్వదేశంలో ఫేవరెట్‌గా.. మూడో ప్రపంచకప్ వేటలో దూసుకెళ్తున్న భారత జట్టుకు దక్షిణాఫ్రికా బ్రేకులు వేసింది. ఆల్‌రౌండ్ షోతో టీమిండియాను ఓడించి.. సూర్యకుమార్ యాదవ్ సేన బలహీనతలను బట్టబయలు చేసింది. తుది జట్టులో మార్పులు, టాపార్డర్ వైఫల్యం ప్రధాన కారణాలు కాగా.. ఓ ఎండ్‌లో క్రీజులో పాతుకుపోయే వారే కరువవ్వడం విజయావకాశాల్ని ఘోరంగా దెబ్బతీసింది. వెస్టిండీస్ చేతిలో జింబాబ్వే చిత్తుగా ఓడిన వేళ.. భారత్ సెమీస్ అవకాశాలు మిణుకుమిణుకు మంటున్నాయి. ఈ పరిస్థితుల్లో యువ క్రికెటర్ తిలక్ వర్మకు మాజీ ఆటగాడు మహమ్మద్ కైఫ్ విలువైన సలహా ఇచ్చాడు.

పొట్టి ప్రపంచకప్‌లో ఒకేఒక ఓటమి భారత్‌ను పునరాలోచనలో పడేసింది. జట్టు కూర్పు.. ఆటగాళ్ల ఫామ్‌ను బేరీజు వేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పకనే చెప్పింది. వరుసగా విఫలమవుతున్న ఓపెనర్ అభిషేక్ శర్మ, తిలక్ వర్మలపై వేటు వేసి.. సంజూ శాంసన్‌కు అవకాశం ఇవ్వాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఎందుకంటే.. సూపర్ 8లో తొలి ఓవర్లోనే ఇషాన్ కిషన్ ఔట్ కావడంతో బాధ్యతగా ఆడాల్సిన తిలక్.. పొడగరి పేసర్ యాన్సెన్‌ను టార్గెట్ చేయబోయి వికెట్ కీపర్ చేతికి దొరికాడు. అనవసరంగా వికెట్ ఇచ్చేశాడని ఈ యంగ్‌స్టర్‌ను సునీల్ గవాస్కర్ గట్టిగానే విమర్శించాడు. ఇక మహమ్మద్ కైఫ్ తన యూట్యూబ్ ఛానెల్లో మాట్లాడుతూ.. తిలక్‌కు విలువైన సలహాలు ఇచ్చాడు. మూడో స్థానంలో విరాట్ కోహ్లీ మాదిరిగా ఇన్నింగ్స్ నిర్మించాలని యువ బ్యాటర్‌కు బోధించాడు.

'తిలక్ వర్మకు సొంత స్టయిల్ ఉంది. తక్కువ స్ట్రయిక్ రేటుతోనూ ఆడగలడు. కానీ, పెద్ద షాట్ ఆడే క్రమంలో ఔటవుతున్నాడు. స్ట్రయిక్ రేటు ఒత్తిడి అందుకు ఓ కారణం. ఆటగాడిగా కోచ్, కెప్టెన్ చెప్పిన పని చేయడం చాలా ముఖ్యం. అతడు విరాట్ కోహ్లీ పాత్రను పోషించాలి. కానీ,. సఫారీలతో మ్యాచ్‌లో తన బాధ్యతను మరిచి.. బిగ్ షాట్‌కు యత్నించాడు తిలక్. ఛేజ్ మాస్టర్ అవ్వాలంటే.. 20 ఓవర్ల వరకూ ఆడాలి. అయితే.. తిలక్ మాత్రం త్వరగా పెవిలియన్ చేరుతున్నాడు. జట్టులో అభిషేక్, ఇషాన్, సుందర్, సూర్యకుమార్, హార్దిక్, రింకూ. వీరంతా అటాకింగ్ గేమ్ ఆడేవాళ్లే. అప్పుడు క్రీజులో నిలిచి.. చివరివరకూ నిలబడేది ఎవరు? ఈ బాధ్యతను తిలక్ తీసుకోవాలి' అని కైఫ్ వెల్లడించాడు.

# విండీస్ భారీ విజయంతో టీమిండియాకు చిక్కులు..

**సెమీస్ చేరాలంటే ఇవే దారులు**

**జింబాబ్వేపై వెస్టిండీస్ 107 పరుగుల తేడాతో భారీ విజయం**

**టీమిండియా సెమీఫైనల్ అవకాశాలు మరింత సంక్లిష్టం**

**నెట్ రన్ రేట్ మెరుగుపరుచుకోవాల్సిన ఒత్తిడిలో భారత్**

**దక్షిణాఫ్రికా-వెస్టిండీస్ మ్యాచ్ ఫలితం అత్యంత కీలకం**

**మిగిలిన రెండు మ్యాచ్‌లలో భారీ విజయాలు సాధిస్తేనే భారత్‌కు అవకాశం**




**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా సెమీఫైనల్ అవకాశాలు మరింత క్లిష్టంగా మారాయి. నిన్న ముంబైలో జరిగిన సూపర్ 8 మ్యాచ్‌లో జింబాబ్వేపై వెస్టిండీస్ ఏకంగా 107 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ ఫలితం భారత్ సెమీస్ సమీకరణాలను పూర్తిగా మార్చేసింది. ఇప్పటికే దక్షిణాఫ్రికా చేతిలో ఓటమితో ఒత్తిడిలో ఉన్న భారత్‌కు, వెస్టిండీస్ సాధించిన ఈ భారీ విజయం నెట్ రన్ రేట్ పరంగా పెద్ద దెబ్బేసింది. దీంతో భారత్ తన తదుపరి మ్యాచ్‌లలో కేవలం గెలవడమే కాకుండా, భారీ తేడాతో విజయాలు సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ సెమీస్ భవితవ్యం ఇతర జట్ల ఫలితాలపై కూడా ఆధారపడి ఉంది. భారత్ తన తర్వాతి మ్యాచ్‌లో బుధవారం చెన్నైలో జింబాబ్వేతో తలపడనుంది. అదే రోజు అహ్మదాబాద్‌లో జరిగే మరో కీలక మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ పోటీపడతాయి. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా గెలిస్తే భారత్ సెమీస్ మార్గం కొంత సులభమవుతుంది.

భారత్ తన మిగిలిన రెండు మ్యాచ్‌లలో (వెస్టిండీస్, జింబాబ్వే) గెలిస్తే 4 పాయింట్లు సాధిస్తుంది. ఒకవేళ దక్షిణాఫ్రికా తన మూడు సూపర్ 8 మ్యాచ్‌లలోనూ గెలిస్తే, భారత్ రెండో జట్టుగా సెమీస్‌కు అర్హత సాధిస్తుంది. అయితే, దక్షిణాఫ్రికా గనుక వెస్టిండీస్ చేతిలో ఓడిపోతే.. భారత్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ మూడు జట్లు 4 పాయింట్లతో సమంగా నిలుస్తాయి. అప్పుడు అత్యుత్తమ నెట్ రన్ రేట్ ఉన్న రెండు జట్లు సెమీస్‌కు వెళతాయి.

భారత్ తన మిగిలిన రెండు మ్యాచ్‌లలో ఒకటే గెలిస్తే, సెమీస్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఆ గెలుపు తప్పనిసరిగా వెస్టిండీస్‌పైనే అయి ఉండాలి. ఒకవేళ భారత్.. విండీస్‌పై గెలిచి, జింబాబ్వే చేతిలో ఓడితే, అప్పుడు దక్షిణాఫ్రికా తన మిగిలిన రెండు మ్యాచ్‌లూ గెలవాలి. అలా జరిగితే భారత్, జింబాబ్వే, వెస్టిండీస్ 2 పాయింట్లతో సమంగా నిలుస్తాయి.

# MOVIE TIME

## వారణాసి కోసం జార్జియాకు మహేశ్ బాబు



టాకీస్: సూపర్‌స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'పై దేశవ్యాప్తంగా కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫాంటసీ మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతోంది. కథను కె.వి. విజయేంద్ర ప్రసాద్, ఎస్.ఎస్. కాంచి అందిస్తుండగా, మాటలను దేవ కట్టా రచిస్తున్నారు. సంగీతాన్ని ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సమకూరుస్తున్నారు. సినిమాలో మహేశ్ బాబు ద్విపాత్రాభినయం చేయనున్నారని సమాచారం. 'రుద్ర'గా శక్తివంతమైన యోధుడిగా, అలాగే పౌరాణిక ఎపిసోడ్‌లో 'రాముడు'గా దర్శనమివ్వనున్నారని టాక్ వినిపిస్తోంది. బాలీవుడ్ స్టార్ ప్రియాంక చోప్రా 'మందాకినీ' పాత్రలో నటిస్తుండగా, పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాత్రల పరిచయంతోనే సినిమాపై అంచనాలు గరిష్ఠ స్థాయికి చేరాయి. హైదరాబాద్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసిన యూనిట్, తదుపరి షెడ్యూల్ కోసం జార్జియాకు వెళుతున్నారు . ఈ నెలాఖరులో ప్రారంభమయ్యే ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఆఫ్రికన్ ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే అడ్వెంచర్ ఎపిసోడ్‌లను విదేశీ లొకేషన్లలో తెరకెక్కించనున్నారని తెలుస్తోంది. అయితే జార్జియాకి వెళుతున్న మహేష్ బాబుకి భార్య నమ్రత, కూతురు సితార సెండాఫ్ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక ఇదిలా ఉంటే గ్రాండ్ యాక్షన్ బ్లాక్స్, భారీ సెట్స్ ఈ షెడ్యూల్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. రామాయణానికి సంబంధించిన ఎపిసోడ్ చిత్రీకరణ ఇప్పటికే పూర్తయిందని రాజమౌళి వెల్లడించడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఇది పూర్తిస్థాయి సైన్స్ ఫిక్షన్ సినిమా కాదని, ఫాంటసీ మైథలాజికల్ జానర్‌కే చెందినదని రాజమౌళి తెలిపారు.

## కల్కి-2 షూటింగ్‌లో బచ్చన్, కమల్



టాకీస్: పాన్ ఇండియా లెవల్లో భారీ విజయాన్ని అందుకున్న 'కల్కి 2898 -2' సీక్వెల్ షూటింగ్ శరవేగంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్, విశ్వనటుడు కమల్ హాసన్ సెట్స్‌లో కలుసుకున్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారాయి. హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో 'కల్కి 2' షూటింగ్ మొదలైనట్లు తెలుస్తుంది. ఈ షెడ్యూల్‌లో అమితాబ్ బచ్చన్ (అశ్వత్థామ), కమల్ హాసన్ (సుప్రీమ్ యాస్కిన్) మధ్య కీలక సన్నివేశాలను దర్శకుడు నాగ అశ్విన్ చిత్రీకరిస్తున్నారు. పాన్ ఇండియా లెవల్లో భారీ విజయాన్ని అందుకున్న 'కల్కి 2898 ఎఊ' సీక్వెల్ షూటింగ్ శరవేగంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్, విశ్వనటుడు కమల్ హాసన్ సెట్స్‌లో కలుసుకున్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారాయి.



## షూటింగ్ సమయంలో జరిగిన ఒక ఘటన.. అనుపమ జీవితాన్ని మార్చేసింది!

టాకీస్: గ్లామరస్ హీరోయిన్‌గా, నటనకు ప్రాధాన్యమున్న పాత్రలతో మెప్పించే అనుపమ పరమేశ్వరన్ అంటే అందరికీ అభిమానమే. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో వరుస చిత్రాలు చేస్తూ ఆమె ఫుల్ బిజీగా ఉన్నారు. మరోవైపు, షూటింగ్ సమయంలో ఆమె జీవితంలో జరిగిన ఒక సంఘటన ఆమెను పూర్తిగా మార్చేసింది. ముఖ్యంగా ఆమె ఆహారపు అలవాట్లను మార్చుకోవడానికి కారణమైన "మటన్ బిర్యానీ" ఉదంతం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని గుర్తు చేసుకుంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'కార్తికేయ-2' సినిమా షూటింగ్ గుజరాత్‌లో జరుగుతున్న సమయం అది. షూటింగ్ స్పాట్‌లో ఒక చిన్న మేకపిల్ల తిరుగుతుండేది. జంతువులంటే ఎంతో ప్రేమ ఉన్న అనుపమ, ఆ మేకపిల్లతో షూటింగ్ విరామంలో ఆడుకునేవారు. దానికి ఆహారం పెడుతూ, దానితో గడుపుతూ షూటింగ్ విరామ సమయాలను గడిపేవారు. ఓ రోజు మధ్యాహ్నం భోజన సమయంలో చిత్ర యూనిట్ అందరికీ మటన్ బిర్యానీ వడ్డించారు. అనుపమ కూడా ఎంతో ఇష్టంగా ఆ బిర్యానీ తింటున్నారు. అదే సమయంలో ఆమె దగ్గరికి వచ్చిన అసిస్టెంట్.. నవ్వుతూ ఒక మాట చెప్పాడు. "మేడం.. మీరు తింటున్నది మీరు పొద్దున ఆడుకున్న ఆ మేకపిల్లనే" అని అన్నాడు. ఆ మాట వినగానే అనుపమ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. తింటున్న ముద్ద కూడా గొంతు దిగలేదు. ఆ విషయాన్ని తట్టుకోలేక ఆమెకు వెంటనే వాంతులు అయ్యాయి. తాను ఎంతో ప్రేమగా ఆడుకున్న మూగజీవాన్ని తన కళ్లముందే చంపి, ఆహారంగా పెట్టారనే విషయాన్ని ఆమె జీర్ణించుకోలేకపోయారు. ఈ సంఘటన అనుపమ మనసుపై ఎంతటి ప్రభావం చూపిందంటే... అప్పటి నుండి ఆమె నాన్-వెజ్ ముట్టడమే మానేశారు.

## జోరు మీదున్న కిరణ్ అబ్బవరం

టాకీస్: టాలీవుడ్‌లో సక్సెస్ ఒక్కటి పడితే హీరోల మార్కెట్ విలువ ఎలా పెరుగుతుందో మరోసారి చర్చకు దారితీసింది. యువ హీరో కిరణ్ అబ్బవరం. వరుసగా మంచి విజయాలు అందుకుంటూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు. ప్రస్తుతం ఇండస్ట్రీలో ఫుల్ క్రేజ్‌ను ఆస్వాదిస్తున్నారని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల వచ్చిన 'క', 'కె ర్యాంప్' సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాలు సాధించడంతో కిరణ్ అబ్బవరం మార్కెట్ గణనీయంగా పెరిగిందని సమాచారం. కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే కథలు, అందులో కామెడీ?ఎమోషన్?సెంటిమెంట్ మేళవింపుతో ఆయన ఎంచుకునే స్క్రిప్ట్స్ నిర్మాతలకు నమ్మకం కలిగిస్తున్నాయంటున్నారు. కిరణ్‌తో సినిమా చేస్తే మినిమమ్ గ్యారెంటీ' అన్న భావన కొందరు నిర్మాతల్లో ఏర్పడిందని ఇండస్ట్రీ టాక్.



దీంతో ఆయనకు భారీ ఆఫర్లు వస్తున్నాయని ప్రచారం. తాజా సమాచారం ప్రకారం, కిరణ్ అబ్బవరం ప్రస్తుతం ఒక్కో సినిమాకు దాదాపు రూ.12 కోట్ల వరకు రెమ్యునరేషన్ అందుకుంటున్నారట. ఇటీవల ఓ ప్రముఖ నిర్మాణ సంస్థతో కుదిరిన ఒప్పందంలో కూడా ఇదే స్థాయిలో పారితోషికం తీసుకున్నారని టాక్ వినిపిస్తోంది. అయితే ఈ విషయంపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. 'కె ర్యాంప్' తర్వాత కిరణ్ అబ్బవరం మరో రిఫ్రెషింగ్ లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ప్రస్తుతం ఆయన 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో 'మ్యాడ్' ఫేమ్ శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తుండగా, సంగీతాన్ని మణిశర్మ అందిస్తున్నారు. కథను 'బేబీ' ఫేమ్ సాయి రాజేష్ అందిస్తున్నారు. నిర్మాత ఙూఐఔతో కలిసి ఈ ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతోంది. చెన్నై నేపథ్యంగా సాగే ఈ లవ్ స్టోరీలో ఫస్ట్ లవ్, రిలేషన్‌షిప్స్‌లోని కొత్త కోణాన్ని చూపించనున్నట్లు విడుదలైన గ్లింప్స్ సూచిస్తోంది. యంగ్ హీరోల్లో కిరణ్ అబ్బవరం, సరైన కథల ఎంపికతో ముందుకెళ్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## కేరళ స్టోరీ మూవీపై హైకోర్టు విచారణ

### ముందుగా కోర్టులో చిత్ర ప్రదర్శనకు ఆదేశం

టాకీస్: 'ది కేరళ స్టోరీ 2' విడుదలకు ముందు కోర్టులో ప్రదర్శించాలని కేరళ హైకోర్టు పేర్కొంది. ఈ సినిమాలో కేరళను తప్పగా చూపించారని ఆరోపణలు నెలకొన్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది. మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలు ఉన్నాయనే రాష్ట్ర ప్రజల ఆందోళనలను విస్మరించలేమని కోర్టు పేర్కొంది.ఈ సినిమా సెన్సార్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం కేరళ హైకోర్టులో విచారణ జరిగింది. కోర్టులు సాధారణంగా సినిమాలకు సంబంధించి భావవ్యక్తీకరణ స్వేచ్ఛ విషయంలో జోక్యం చేసుకోదు. కానీ.. ఈ సినిమా టైటిల్‌లో కేరళ రాష్ట్రం పేరు ఉపయోగించారని ఈ నేపథ్యంలో దీనిపై విచారణకు అంగీకరించినట్లు పేర్కొంది. ఫిబ్రవరి 25న 'ది కేరళ స్టోరీ 2'ను కోర్టులో ప్రదర్శించాలని ఆ తర్వాతే దీని సెన్సార్ విషయంలో నిర్ణయం తీసుకోగలమని తెలిపింది. కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు ఇటీవల 'యూ/ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. 2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా రూపొందింది 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్'. టీజర్, ట్రైలర్లు విడుదలయ్యాక ఈ మూవీ కూడా చర్చనీయాంశంగా మారింది. దీనిపై




తాజాగా.. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ దీనిపై స్పందించారు. ఈ సినిమాపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. దీన్ని బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 27న ఈ చిత్రం విడుదల కానుంది.

## బాలయ్య, పూరి కాంబినేషన్

### మూవీ చేస్తున్నారంటూ టాలీవుడ్ టాక్

టాకీస్: టాలీవుడ్‌లో మాస్ ఇమేజ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన నందమూరి బాలకృష్ణ, డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ తో మరోసారి చేతులు కలపబోతున్నారనే వార్తలు ఫిలిం నగర్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. అధికారిక ప్రకటన రాకపోయినా, ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుందన్న ప్రచారం ఆసక్తి రేకెత్తిస్తోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన పైసా వసూల్ బాక్సాఫీస్ వద్ద మిశ్రమ ఫలితాన్ని అందుకున్నప్పటికీ, బాలయ్యను స్టైలిష్ మరియు డిఫరెంట్ అవతార్‌లో చూపించడంలో పూరీ విజయం సాధించారు. ఆ సినిమాతో ఇద్దరి మధ్య మంచి అనుబంధం ఏర్పడిందని అప్పట్లోనే ఇండస్ట్రీలో టాక్ వినిపించింది. ఇప్పుడు ఆ బాండింగ్ రెండో సినిమాకు దారితీస్తుందా? అన్నది చర్చనీయాంశమైంది. ప్రస్తుతం పూరీ జగన్నాథ్ ఫామ్‌లో లేకపోయినా, ఆయన ప్రత్యేకమైన మేకింగ్ స్టైల్, పవర్‌ఫుల్ క్యారెక్టరైజేషన్‌పై బాలకృష్ణ నమ్మకం ఉంచినట్లు సమాచారం. సరైన కథతో వస్తే పూరీతో మరోసారి పని చేయడానికి బాలయ్య సిద్ధంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఇంకా



వెలువడలేదు. అఖండ విజయంతో బాలకృష్ణ కెరీర్‌లో కొత్త ఊపు వచ్చింది. యంగ్ డైరెక్టర్లతో కలిసి తన ఇమేజ్‌కు తగ్గ కథలను ఎంచుకోవడం ఆయన విజయాలకు ప్రధాన కారణంగా మారింది. ఇటీవల కాలంలో కథ ఎంపికలో బాలయ్య చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. దర్శకుడి పేరు కంటే కథలోని కొత్తదనం, పాత్ర బలానికే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారని సమాచారం. ఇక పూరీ జగన్నాథ్ విషయానికి వస్తే, ఆయన ప్రస్తుతం విజయ్ సేతుపతితో ఓ కొత్త ప్రాజెక్ట్ తెరకెక్కిస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.